సంక్రాంతి సంబరం

విద్యాలయాల్లో ఆకట్టుకున్న ముందస్తు వేడుకలు

తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా వస్త్రధారణ.. కనుమరుగవుతున్న హరిదాసుల వేషధారణ.. చూడముచ్చటైన ముగ్గుల మధ్య గొబ్బెమ్మలు.. బొమ్మల కొలువు.. భోగి మంటలు.. పొంగళ్లు పొంగించడం.. అందంగా తీర్చిదిద్దిన పశువులకు పూజలు అబ్బో సంక్రాంతి ముందే వచ్చిందా అన్న రీతిలో జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ముందస్తు పండగ సంబరాలు అంబరాన్ని తాకాయి. శుక్రవారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు విద్యాసంస్థలకు సంక్రాంతి సెలవులు ప్రకటించగా, ముందు రోజు గురువారం ఈ వేడుకలు జరిగాయి. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు పట్టువస్త్రాలు ధరించడంతో నూతన శోభ సంతరించుకుంది. పల్లెవాసుల జీవన విధానం, వ్యవసాయ పనిముట్లు, రచ్చబండ, పొంగళ్లు, కోడిపందేల తదితర కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే చిన్నారులకు భోగిపండ్లు పోసి భోగి పండుగ విశిష్టతను తెలియచేయడంతోపాటు పాటలు, నృత్యాలతో సంక్రాంతి గొప్పతనాన్ని అర్థమయ్యే రీతిలో ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు రంగవల్లులు, నృత్యాలు, గాలిపటాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు.

- ఆంధ్రజ్యోతి బృందం



సంగం : ఉన్నత పాఠశాలలో భోగి మంట చుట్టూ పండరి భజన వేస్తున్న విద్యార్థులు



సోది చెబుతానమ్మ సోది : కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో ఓ విద్యార్థి వేషధారణ



నెల్లూరు : గుడిసె సెట్టింగ్ మధ్య పండుగ సంబరం

నేటి నుంచి సెలవులు

నెల్లూరు (విద్య) : జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు శుక్రవారం నుంచి 19వ తేదీ వరకు సెలవులు ప్రకటించినట్లు డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ అనంతరం ఈ నెల 20వ తేదీన పాఠశాలలు పునః ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ముగిసిన 'పోలీసు' పరీక్షలు

- 4,692 మందికి 3,334 మంది హాజరు
- చివరి రోజు ఐజీ పరిశీలన

4



నెల్లూరు : రంగనాథస్వామి సన్నిధిలో సిద్ధమైన ఉత్తర ద్వారం

వేకువ నుంచే వైకుంఠనాథుడి దర్శనం

నేడు ముక్కోటి ఏకాదశి

వైష్ణవాలయాల్లో భారీ ఏర్పాట్లు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ఏకాదశి (ముక్కోటి) పర్వదినం కోసం జిల్లాలోని ప్రముఖ వైష్ణవాలయాల్లో భారీ ఏర్పాట్లు చేశారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించేలా పాలక మండళ్లు ఏర్పాట్లు చేశాయి. ప్రత్యేక క్యూలైన్లు, భక్తులకు ఉచిత ప్రసాదాలు, తాగునీరు అందించేలా సర్వం సిద్ధం చేశారు. పోలీసులు పటిష్ట భద్రత చర్యలు చేపట్టారు. నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి, మూలాపేట వేణు గోపాలస్వామి, వేదగిరి లక్ష్మీ నృసింహ స్వామి ఆలయాల్లో, శబరి శ్రీరామ క్షేత్రం, బాలాజీనగర్ సీతారామ మందిరంలో ఉత్తర ద్వార దర్శనం కోసం ప్రత్యేక సెట్టింగ్‌తో ఏర్పాట్లు చేశారు.



రంగనాథస్వామి ఆలయం ముందు చలువ పందిళ్లు

అంతా పాస్.. అయ్యో తుస్!

వీఎస్‌యూ పరీక్షల విభాగం తీరిది!

ఫలితాల విడుదలలో గందరగోళం ● విద్యార్థుల గగ్గోలు

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరీక్షల విభాగంలో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి, సర్టిఫికెట్ల జారీ తదితర అంశాల్లో రోజుకో వివాదం రేగుతోంది. వర్సిటీ ఉన్నతాధికారులు మాత్రం అసలేం జరగనట్లుగా నిమ్మకుండి పోతుండటం విమర్శలకు తావిస్తోంది. చదువు పూర్తయిన విద్యార్థులు, తల్లిదండ్రులు నిత్యం యూనివర్సిటీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ సర్టిఫికెట్లు అందక అధికారులతో, సిబ్బందితో వాదనలకు దిగడం నిత్యకృత్యంగా మారిపోతోంది.

నెల్లూరు (విద్య), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన విక్రమ సింహపురి విశ్వవిద్యాలయాన్ని వివాదాలు వెంటాడుతూనే ఉన్నాయి. తాజాగా పరీక్షల విభాగం తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటోంది. డిగ్రీ, పీజీ ఏదైనా అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడించాలి. ప్రధానంగా న్యాక్ వంటి గుర్తింపు కలిగిన వర్సిటీ పరీక్షలు నిర్వహించిన నెలరోజుల్లోపే ఫలితాలను ప్రకటించాల్సి ఉంటుంది. పరీక్షల నిర్వహణకు సంబంధించి టైం టేబుల్ వెల్లడి, ఫలితాల ప్రకటన, రీవాల్యూయేషన్ వంటి అంశాల వరకు ప్రతి దానిలో కూడా తీవ్రం జాప్యం చేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అనుభవం లేని, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు పనిచేయడంతో నిత్యం ఈ విభాగం వివాదాలకు నిలయంగా మారిందని అధ్యాపకులే చెబుతుండటం గమనార్హం. వర్సిటీ ఉపకులపతి (వీసీ)తో ఇటీవల జరిగిన సమావేశాల్లో సైతం ఈ అంశాలను ప్రస్తావించినట్లు తెలిసింది. పరీక్షల నియంత్రణాధికారి, పీజీ విభాగపు అదనపు పరీక్షల నియంత్రణాధికారి చర్యలతో తాము ఇబ్బందులు పడుతున్నామని, విద్యార్థులకు సమాధానం కూడా చెప్పలేకపోతున్నామని వీసీ దృష్టికి తీసుకెళ్లినట్లు పలు కళాశాలల కరస్పాండెంట్లు తెలిపారు. వర్సిటీ కళాశాలలో సైతం గతేడాది ప్రవేశాలు జరిపిన 4వ సంవత్సరం యూజీ హానర్స్ విత్ రీసెర్చ్ ఫలితాల కోర్సు పూర్తి చేసి 9 నెలలు గడుస్తున్నా ఫలితాలు విడుదల చేయలేదు.



● అక్రమాలకు అడ్డాగా...

వర్సిటీలోని పరీక్షల విభాగం అక్రమాలకు అడ్డాగా మారిపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పరీక్షల్లో పాస్ చేయిస్తామని చెప్పి వసూళ్లకు పాల్పడే దళారులు, పరీక్షల్లో ఒకరికి బదులు మరొకరితో రాయిస్తున్న ఉదంతాలు ఇటీవల అధికమయ్యాయి. తాజాగా ఎంపీఈడీ పరీక్షల్లో నలుగురు వ్యక్తులు వేరొకరి బదులు పరీక్ష రాస్తూ పట్టు బడటంతో అందరూ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అయితే వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సిన అధికారులు మాత్రం అంతర్గత కమిటీ వేసుకుని క్రిమినల్ చర్యలకు పాల్పడిన వారిని సాధారణ విద్యార్థుల మాదిరిగానే డీబార్ చేయడం విమర్శలకు తావిస్తోంది. ఈ ఘటనలో పెద్దఎత్తున ఆర్థిక లావాదేవీలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా గతంలో ప్లేగియారిజం చేసి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడి యూనివర్సిటీలో ఉద్యోగం పొందిన ఓ అధ్యాపకుడికి వర్సిటీ వ్యవహారాల్లో ఎలాంటి బాధ్యతలు అప్పగించకూడదు. అయితే అధికారులు మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా పరీక్షలకు సంబంధించిన ఫీజులను నిర్ణయించే కమిటీ, మాల్ ప్రాక్టీస్‌లను గుర్తించే కమిటీల్లో బాధ్యతలు అప్పగించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో వర్సిటీ అధికారులకే తెలియాలి.



తొలుత పాస్ అయినట్లు వచ్చిన ఫలితాలు



తర్వాత ఫెయిల్ అయినట్లు వచ్చిన ఫలితాలు

● గందరగోళంగా ఫలితాలు..

ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, బీపీఈడీ, ఎంపీఈడీ మొదటి సెమిస్టర్ రీవాల్యూయేషన్ ఫలితాలను డిసెంబర్ రెండో వారంలో విడుదల చేశారు. ఈ సమయంలో ఆయా విద్యార్థులు మూడో సెమిస్టర్ పరీక్షలు రాస్తుండటం విశేషం. మొదటి సెమిస్టర్‌లో ఫెయిల్ అయిన వారికి డిసెంబరు చివరివారం వరకు ఫీజులు కట్టుకునే అవకాశం ఉంటుంది. అయితే అనేకమంది రీవాల్యూయేషన్‌లో ఫలితాలు చూసుకుని తాము పాస్ అయిపోయామని ఫీజులు కూడా కట్టలేదు. కొన్నిరోజుల తరువాత సెమిస్టర్ ఫీజు కట్టే చివరి తేదీన వర్సిటీ అధికారులు మరోసారి మొదటి సెమిస్టర్ రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేసి అనేకమందిని ఫెయిల్ చేశారు. దీంతో ఇప్పుడు పరీక్షకు ఫీజు కట్టుకునే అవకాశం లేక విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొంతమంది విద్యార్థులకు

- మిగతా 4లో..

విరూపాక్ష.. ఏది నీకు రక్ష!?

చెన్నకేశవా నీకు దిక్కెవరు?

పరాధీనమవుతున్న ఆలయాల భూములు

వైసీపీ నేతల అక్రమ కట్టడాలు

ఆక్రమణలపై ప్రశ్నించిన వారిపై దాడులు

మేల్కోకుంటే విలువైన మాన్యం పరులపాలు

ముత్తుకూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : కోట్ల రూపాయల ఆస్తులున్న విరూపాక్ష స్వామి దేవాలయ భూములకు రక్షణ కరువైంది. కొలిచిన వారిని కరుణించే చెన్నకేశవ స్వామికి చెందిన భూములూ ఆక్రమణకు గురవుతున్నా కాపాడే దిక్కెవరో తెలియని దైన్యస్థితి మండలంలోని ఈపూరులో నెలకొన్నది. చెన్నకేశవ స్వామి ఆలయానికి 150 ఎకరాల మెట్ట, 17 ఎకరాల మాగాణి భూములు ఉండగా, విరూపాక్ష స్వామి ఆలయానికి 174 ఎకరాల మెట్ట, 8 ఎకరాల మాగాణి భూములు ఉన్నాయి. రూ.కోట్ల విలువచేసే భూములున్నా ఈ ఆలయాలకు నిత్యధూప దీప నైవేద్యం కరువైంది. గత వైసీపీ పాలనలో కాదేది ఆక్రమణలకు అనర్హం అన్నట్టుగా ఆ పార్టీ నాయకులే దేవుడి భూములనే యథేచ్ఛగా ఆక్రమించుకున్నారు. ఐదేళ్లలో తమను అడిగేవారు లేరంటూ అక్రమంగా విరూపాక్ష స్వామి, చెన్నకేశవ స్వామి దేవస్థానాలకు చెందిన భూములను ఆక్రమించి పశువుల పాకలు, గడ్డివాములతోపాటు ఏకంగా అక్రమ కట్టడాలే నిర్మించేశారు. ఇదేమని అడిగిన వారిని అధికార బలంతో భయపెట్టి బెదిరించారు. ఈపూరులో రోడ్డు వెంబడి సర్వే నెంబరు 605లో విరూపాక్ష స్వామి, చెన్నకేశవస్వామి దేవస్థానాలకు 14, 15 ఎకరాల విలువైన భూములు ఉన్నాయి. గతంలో ఈ భూములను ఇతర భూములతో కలిపి దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలం పాట నిర్వహించి సాగు చేసుకునేందుకు అప్పగించేవారు. వేలంలో ఈ భూములు దక్కించుకున్న వారు పశువులు మేపుకునేందుకు, సాగు చేసుకునేందుకు మాత్రమే వాడుకుంటూ దేవదాయ శాఖకు వేలం మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. భూముల స్వరూపాన్ని మార్చేందుకు, నిర్మాణాలు చేపట్టకూడదు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నేతల కన్ను విలువైన ఈ దేవదాయ శాఖ భూములపై పడ్డాయి. ఈపూరు గ్రామంలో ప్రధాన కూడలిలో రోడ్డు వైపు ఉన్న భూములను ఆక్రమించేందుకు సిద్ధమయ్యారు. తొలుత గడ్డివాములు, పశువుల పాకలతో మొదలైన ఆక్రమణలు, క్రమేపీ తాత్కాలిక అంగళ్ల ఏర్పాటుకు పాకాయి. ఎవరు అడగరు అన్న ధైర్యంతో కొద్దిరోజుల తర్వాత ఏకంగా కట్టడాలు నిర్మించి ఇళ్లు వేసుకున్నారు. అప్పటి నుంచి ఈ భూములు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ప్రస్తుతం ఏకంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకోవడంతోపాటు ఇంటి పన్నులు చెల్లింపులకూ సిద్ధమయ్యారు. ఇప్పటికైనా దేవదాయ శాఖ అధికారులు మేల్కొని ఆక్రమణలను తొలగించేందుకు కఠిన చర్యలు తీసుకోకపోతే రూ.కోట్ల విలువ చేసే దేవదాయ భూములు ఆక్రమణ దారుల చేతుల్లోకి వెళ్లిపోయే ప్రమాదం ఉంది.



ఆలయాల స్థలంలో వెలసిన దుకాణాలు



చర్యలు తప్పవు

నిబంధనలను అతిక్రమించి ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవు. పశువుల కోసం వేసిన షెడ్లను వేలం వ్యవధి పూర్తిగానే తొలగించాల్సి ఉంటుంది. వేలంలో దక్కించుకున్న భూములను నిబంధనల మేరకే ఉపయోగించుకోవాలి. అక్రమ కట్టడాలు ఉంటే వెంటనే తొలగిస్తాం. దేవదాయ శాఖ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- భాస్కర్, ఈవో



గడ్డివాముల పేరుతో ఆక్రమణల పర్వం

కోట్ల విలువైన భూములు ఆక్రమించేశారు



ఈపూరులో రోడ్డు వెంబడి రూ.కోట్లు విలువైన దేవాలయ భూములను ఆఆక్రమించేశారు. పశువులను మేపుకునేందుకు షెడ్లు వేసుకుంటామన్న సాకుతో అక్రమ కట్టడాలు చేపట్టారు. వీటిని అధికారులు వెంటనే తొలగించాలి. లేని పక్షంలో విలువైన దేవాలయ భూములు అన్యాక్రాంతం అవుతాయి.


- ఉడతా వెంకయ్య, ఈపూరు

అధికారులు స్పందించాలి



విలువైన దేవుడి భూములను ఆక్రమించేస్తున్నా పట్టించుకునే దిక్కెవరు?. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు విరూపాక్ష, చెన్నకేశవ స్వామి ఆలయాల భూములను ఆక్రమించుకున్నారు. శాశ్వత కట్టడాలతో ఈ భూములు సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అధికారులు తక్షణం స్పందించి అడ్డుకోవాలి.

- నజీర్, ఈపూరు



వలేటివారి పాలెంలో నెలల తరబడి వెలుగుతున్న వీధిలైటు

వలేటివారిపాలెంలో నిత్యం వెలుగులే..!



తహసీల్దార్ కార్యాలయం భవనంపై వెలుగుతున్న ఎల్ఈడీ లైటు

ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభానికి ఉన్న వీధిలైటు రాత్రిపగళు వెలుగుతూనే ఉంది. అంతే గాకుండా తహసీల్దార్ కార్యాల యం భవనం పైన, రైతుభరోసా కేంద్రం భవనం, మండల పరిషత్ కార్యాలయం, గ్రామ సచివాల యం భవనాలపైన, తహసీల్దార్ కార్యాలయం కుడి ప్రక్కన అంగన్ వాడీ కేంద్రం ప్రక్కన వీధిలైటు కూడా నిరంతరం వెలుగుతూనే ఉంది. అలాగే 4వ వార్డులో గత నెల రోజుల నుండి వీధిలైట్లు అన్నీ రాత్రి పగళ్లు వెలుగుతూనే ఉన్నాయి. దీంతో పంచాయతీలపై ఆర్థిక బిల్లుపై భారం పడుతుంది. అయినా సంబంధిత అధికారులు, విద్యుత్ సిబ్బంది తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)



మోహినిగా మురుయుగొల్పి...

వేణుగోపాలుడు, రంగనాథుడికి మోహినీ అలంకరణ



నెల్లూరులోని రంగనాథ స్వామి, మూలాపేట వేణుగోపాల స్వామి ఆలయాల్లో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో గురువారం శ్రీవారు మోహినీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విశేష పూజలు, ఆళ్వార్ల ఘోష్ఠి, దివ్యనాలాయిర ప్రబంధ ఘోష్ఠి గానం, శాత్తుముర్రై, గోదాదేవికి అభిషేకాలు, ధనుర్మాస పూజలు, తిరుప్పావై పారాయణం జరిగాయి.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



సూక్ష్మ సేద్యానికి
సబ్సిడీలు

- ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సాగునీటిని పొదుపుగా వాడుకుంటూ అధిక దిగుబడులను సాధించే దిశగా, రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఇందుకు గాను ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల ప్రాజెక్టు (ఏపీఎంఐపీ) ఆధ్వర్యంలో బిందు, తుంపర్ల సేద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నది. ఈక్రమంలో చిన్న, సన్నకార రైతులకు 45 నుచి 90శాతం వరకు రాయితీపై అవసర మైన పరికరాలను అందచేస్తున్నది. దీంతో జిల్లాలోని ఎంతోమంది రైతులకు లబ్ధి చేకూరుతోంది. వీటికి సంబంధించిన పూర్తి వివరాలను ఏపీ ఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ బీ శ్రీనివాసులు ఆంధ్రజ్యోతికి వివరించారు.

?: జిల్లాలో బిందు, తుంపర్ల సేద్యం అమలు లక్ష్యం

!: బిందు, తుంపర్ల సేద్యానికి ప్రభుత్వం ఎక్కువ ప్రోత్సాహాన్ని ఇస్తోంది. 2024-25 సంవత్సరానికి 92వేల హెక్టార్లలో అమలు చేయాలని లక్ష్యంగా నిర్ధేశించారు. పరికరాల సరఫరాకు 9 కంపెనీలను ఎంపిక చేశారు.

?: ఎన్ని రిజిస్ట్రేషన్లు జరిగాయి. క్షేత్రస్థాయిలో ఎన్ని హెక్టార్లకు అనుమతి లభించింది.

!: ఇప్పటి వరకు 8412 మంది రైతులు నమోదు చేసుకున్నారు. సుమారుగా 10,277 హెక్టార్ల మేర నమోదైంది. 2304 హెక్టార్లకు సబ్సిడీ అనుమతులు వచ్చాయి. పాతబకాయిలు కూడా ప్రభుత్వం విడుదల చేయనుండగా, అవి నేరుగా రైతుల ఖాతాలకే జమవుతాయి.

?: బిందు సేద్యం రాయితీకి నిబంధనలు

!: ఐదెకరాల పొలం కలిగిన రైతులకు 90శాతం రాయితీతో రూ.2.18 లక్షల వరకు పొందవచ్చు. ఐదు ఎకరాల నుంచి 10ఎకరాలలోపు రైతులకు 70శాతం రాయితీ ద్వారా రూ.3.46 లక్షల వరకు రాయితీ పొందవచ్చు.

?: తుంపర్ల సేద్యం రాయితీ వివరాలు

!: 2.5ఎకరాల పొలం ఉన్న రైతులకు 55శాతం రాయితీతో 30 పైపులు, 5 స్ప్రింక్లర్లు అందుతాయి. 2.5 నుంచి ఐదు ఎకరాలలోపు పొలం ఉన్న రైతులకు 55శాతం రాయితీతో 41పైపులు, 9 స్ప్రింక్లర్లు అందుతాయి. అలాగే 5 నుంచి 10ఎకరాల లోపు రైతులకు 45శాతం రాయితీతో 30 పైపులు, 5 స్ప్రింక్లర్లు, లేదంటే 41 పైపులు 9 స్ప్రింక్లర్లు అందుతాయి.

?: దరఖాస్తు చేసుకోవడం ఎలా..

!: రైతులు తమ పట్టాదారు పాసు పుస్తంతో పాటు ఆధార్, బ్యాంకు పుస్తకం వివరాలతో సమీపంలోని రైతు సేవా కేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్లలో నమోదు చేసుకోవచ్చు. రైతు చెల్లించే వాటాను ప్రాజెక్టు డైరెక్టర్, ఏపీ ఎంఐపీ నెల్లూరు, అకౌంటు నెంబరు 917010086607447కు చెల్లించాలి.

ముఖాముఖీ

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (హరనాథపురం), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : బీసీ, కాపు, ఈబీసీ కులాల వారు 2024-2025 ఆర్థిక సంవత్సరానికిగాను సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ అధికారి నిర్మలాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 1328 యూనిట్లు, ఈబీసీ కార్పొరేషన్ ద్వారా 91, కమ్మ కార్పొరేషన్ నుంచి 100, రెడ్డి కార్పొరేషన్ 140, ఆర్యవైశ్య కార్పొరేషన్ 41, క్షత్రియ కార్పొరేషన్ 6, బ్రాహ్మణ కార్పొరేషన్ 32, కాపు కార్పొరేషన్ ద్వారా 231 యూనిట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. అలాగే జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటుకు కూడా సబ్సిడీ రుణాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఎంఎస్ఎంఈ బ్యాంకు లింక్ యూనిట్లకు రూ.25లక్షల లోపు సబ్సిడీతో రుణాలు మంజూరు చేయ నున్నట్లు వివరించారు. జిల్లాలో అర్హత గల బీసీ, ఈబీసీ, కాపు కులాలకు చెందిన లబ్ధిదారులందరూ తమ రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ, జనన ధ్రువీకరణ పత్రాలతో ఏపీఓబీఎం ఎంఎస్ పోర్టల్ ఓపెన్ కాగానే నమోదు చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు.

ఉన్నత చదువులు చదివేందుకు పేద విద్యార్థులకు చేయూత అందిస్తోంది సీడ్స్ స్వచ్ఛంద సంస్థ. పదవ తరగతిలో 90 శాతానికిపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.2లక్షల వరకు ఉపకార వేతనం మంజూరు చేస్తోంది. అంతేకాదు.. అనాథ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పడించడమేగాకుండా మహిళల ఆర్థికాభివృద్ధికి సహకరిస్తోంది. అలాగే.. అన్నదాతలను ప్రోత్సహించే దిశగా వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతపై శిక్షణ కూడా అందిస్తోంది సదరు సంస్థ.

- దుత్తలూరు (ఉదయగిరి, ఆంధ్రజ్యోతి)



సీడ్స్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉపకార వేతనాలు పొందిన విద్యార్థులు



పేదపిల్లలకు ఆర్థిక చేయూత

- ఒక్కో విద్యార్థికి రూ.2 లక్షల ఉపకార వేతనం
- ఇప్పటివరకు జిల్లాలో 112 మందికి అందజేత
- ఆదర్శంగా నిలుస్తున్న సీడ్స్ స్వచ్ఛంద సంస్థ

ఆదర్శం

దుత్తలూరుకు చెందిన విశ్రాంత ఐఏఎస్ అధికారి రామిరెడ్డి చంద్ర మౌళీశ్వర రెడ్డి తన స్వగ్రామానికి సేవా చేయాలనే తలంపుతో సీడ్స్ స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. సంస్థ ద్వారా రైతులు, మహిళలు, విద్యార్థులకు అనేక సేవలు అందిస్తున్నారు. అనాథ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడం, పలు రంగాల్లో మహిళలకు శిక్షణ ఇవ్వడం, సాంకేతిక వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ తరుణంలో విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అందులో భాగంగా 2022-23 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో 90 శాతం మార్కులకుపైగా సాధించిన విద్యార్థులకు ఉపకార వేతనాలను అందజేస్తోంది. అలాంటి విద్యార్థులు సంస్థకు దరఖాస్తు చేసుకుంటే వారే స్వయంగా విద్యార్థి ఇంటికెళ్లి కుటుంబ ఆర్థిక పరిస్థితులు గమనించి ఉపకార వేతనం అందజేస్తారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో రూ.50 వేలు, ద్వితీయ సంవత్సరంలో రూ.50 వేలు ఇస్తారు. అలాగే, బీటెక్ లేదా మెడిసిన్ చదివే విద్యార్థులకు ఏడాదికి రూ.25 వేలు చొప్పున నాలుగేళ్లకు రూ.లక్ష అందజేస్తారు. ఇలా మొత్తం రూ.2 లక్షల ఉపకార వేతనాన్ని విద్యార్థికి అందజేస్తారు. ఇప్పటివరకు జిల్లాలో 112 మంది విద్యార్థులకు సీడ్స్ స్వచ్ఛంద సంస్థ అందజేసింది. అర్హులైన వారు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నా అందరికీ ఉపకార వేతనాలు ఇస్తామని నిర్వాహకులు చెబుతున్నారు.


కల సాకారమైంది



పదో తరగతిలో 90 శాతం మార్కులు సాధించా. ఉన్నత చదవులు చదివేందుకు కుటుంబ ఆర్థిక స్థోమత సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నా. ఈ పరిస్థితుల్లో సీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఉపకార వేతనం అందిస్తుందని తెలుసుకొని దరఖాస్తు చేసుకున్నా. తన ప్రతిభను చూసి సంస్థ రూ.2 లక్షల ఉపకార వేతనం మంజూరు చేయడంతో బీటెక్ చదువుతున్నాం.

- కిన్నెర మానస, మర్రిపాడు

సంస్థ సహకారంతో చదువుకుంటున్నా



పదో తరగతిలో 92 శాతం మార్కులు సాధించా. ఆ తర్వాత చదివేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆ సమయంలో సీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఉపకార వేతనానికి దరఖాస్తు చేశా. వారు నా ప్రతిభను గుర్తించి రూ.2 లక్షల ఉపకార వేతనం మంజూరు చేశారు. ప్రస్తుతం బీఎస్సీ బయోటెక్నాలజీ చదువుతున్నాను.

- శానంపూడి గౌతమి, వింజమూరు

విద్యకు దూరం కాకూడదనే!



విద్యలో ప్రతిభ చూపుతూ కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత చదువులు చదవలేని నిరుపేద పిల్లల కోసమే ఉపకార వేతనం అందజేస్తున్నాం. ఆ విద్యార్థుల పురోగతిలో భాగస్వామ్యం కావడం నాకెంతో ఆనందంగా ఉంది. 2008లో సీడ్స్ స్వచ్ఛంద సంస్థ స్థాపించాం. అప్పటి నుంచి రైతులకు పంటల సాగులో సాంకేతిక సలహాలు ఇవ్వడం, మహిళలకు వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తుండటంతో ఉపాధి పొందుతున్నారు. మెట్ట ప్రాంత ప్రజలు ఆర్థికంగా నిలబడేలా చేయడమే నా లక్ష్యం.

- రామిరెడ్డి చంద్రమౌళీశ్వరరెడ్డి, సీడ్స్ వ్యవస్థాపకుడు

అయ్యో తుస్!

(3వ పేజీ తరువాయి)

అయితే మొదటి సెమిస్టర్ ఫలితాలను రెండోసారి తిరిగి విడుదల చేశారన్న విషయం కూడా తెలియక తాము పాస్ అయిపోయామన్న భ్రమలో ఉన్నారు. అసలు ఒకసారి ఫలితాలు విడుదల చేసిన అధికారులు తిరిగి అవే ఫలితాలను రెండోసారి విడుదల చేయాల్సిన అవసరం ఏమిటని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. వర్సిటీ అధికారుల తప్పిదాలకు తమను బలిచేస్తున్నారని, తమ జీవితాలతో ఆడుకుంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. దీనిపై సంబంధిత పరీక్షల విభాగం అధికారులను సంప్రదించే ప్రయత్నం చేయగా వారు స్పందించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పరీక్షల విభాగాన్ని ప్రక్షాళన చేయడంతోపాటు యూనివర్సిటీ ప్రతిష్టను కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని విద్యా ప్రముఖులు అంటున్నారు..

వర్సిటీలో ఎలాంటి ఇబ్బందులు లేవు

విశ్వవిద్యాలయంలో ఎలాంటి ఇబ్బందులు లేవు. నేను వీసీగా బాధ్యతలు స్వీకరించి కొంతకాలమే అయినా అన్ని విభాగాలపై అధ్యయనం చేస్తున్నాను. ఏదైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దుతా. పరీక్షల ఫలితాలు రెండుసార్లు విడుదల చేశారన్న అంశం నా దృష్టికి రాలేదు. పరీక్షల విభాగం వారితో చర్చించి వివరాలు తెలుసుకుంటాను. ఎలాంటి తప్పులు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటాను. అలాగే మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన వారి వివరాలను ప్రత్యేక కమిటీకి నివేదించాం. కమిటీ నిర్ణయం తీసుకుని చర్యలు తీసుకుంటుంది. తప్పుచేసిన ఎవరినీ ఉపేక్షించేది లేదు. పూర్తిస్థాయి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటా.

- విజయభాస్కర్‌రావు, ఉపకులపతి



బందోబస్తు విధులకు హాజరైన పోలీసు సిబ్బంది

ముక్కోటికి పటిష్ట బందోబస్తు : ఎస్పీ

నెల్లూరు(క్రైం), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి సందర్భంగా జిల్లాలోని దేవాలయాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ జీ కృష్ణకాంత్ తెలిపారు. బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు సిబ్బందికి గురువారం నెల్లూరులోని ఓ కల్యాణ మండపంలో ఎస్పీ బ్రీఫింగ్ నిర్వహించారు. దేవాలయాలు, వాటి పరిసరాల్లో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల తాకిడి అధికంగా ఉన్న ఆలయాల వద్ద బ్యారికేడింగ్, క్యూ లైన్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశిత ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్‌కు అనుమతించాలన్నారు. అనుమానిత వ్యక్తుల వివరాలు, వేలిముద్రలు సేకరించాలని ఆదేశించారు. ఆలయాల పాలకమండళ్లు ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

మద్యం స్వాధీనం

నెల్లూరులోని పొర్లుకట్ట ప్రాంతంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నాగరాజా అనే వ్యక్తిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు-1 పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 9 క్వార్టర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ డీ శ్రీధర్, హెడ్‌కానిస్టేబుల్ ఫిరోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

ముగిసిన 'పోలీసు' పరీక్షలు

- 4,692 మందికి 3,334 మంది హాజరు
- చివరిరోజు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పరిశీలన

నెల్లూరు(క్రైం), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన దేహదారుఢ్య పరీక్షలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు పరీక్షల తీరును గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పరిశీలించారు. అయితే పది రోజులు జరిగిన ఈ ఫిజికల్ టెస్టుకు 1356 మంది గైర్హాజరవడం గమనార్హం.

కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించి రెండేళ్ల క్రితం నిర్వహించిన ప్రాథమిక రాత పరీక్షకు 20,352 మంది హాజరుకాగా వారిలో దేహదారుఢ్య పరీక్షలకు 3,857 మంది పురుషులు, 835 మంది మహిళలు కలిపి 4692 మంది అర్హత సాధించారు. వారికి గత ఏడాది డిసెంబరు 30వ తేదీ నుంచి ఫిజికల్ టెస్టులను నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో ఎస్పీ కృష్ణకాంత్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. అయితే 2768 మంది పురుషులు, 566 మహిళలు కలిపి 3334 మంది మాత్రమే ఫిజికల్ పరీక్షలకు హాజరయ్యారు. 1356 మంది గైర్హాజరయ్యారు. మొత్తం హాజరైన వారిలో 1573 పురుషులు, 197 మంది మహిళలు కలిపి మొత్తం 1770 మంది మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించినట్లు అధికారులు ప్రకటించారు.

ఐజీ పరిశీలన

చివరి రోజు గురువారం జరిగిన దేహదారుఢ్య పరీక్షలను ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి క్షుణ్ణంగా పరిశీలించారు. మెయిన్ గేట్ ప్రవేశం దగ్గర నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్, బయోమెట్రిక్, శారీరక కొలతలు తీయడం, 1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్... ఇలా అన్నీ అంశాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

అభ్యర్థులకు ఏర్పాటు చేసిన వైద్య శిబిరం, మంచినీరు, ఇతర వసతులను కూడా ఐజీ పరిశీలించారు. కొందరు అభ్యర్థులతో మాట్లాడి ఏర్పాట్లపై ఆరా తీశారు. కాగా, చివరి రోజు పరీక్షలకు 463 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అనంతరం ఎస్పీ జీ కృష్ణకాంత్ టైమింగ్ టెక్నికల్ ఇంజనీర్లను అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. దిగ్విజయంగా ఎంపిక ప్రక్రియ పూర్తి చేసిన పోలీసు, డీపీవో యంత్రాంగాన్ని అభినందించారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- కాంగ్రెస్ నిరసన

నెల్లూరు (వైద్యం), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం కొత్తూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు నిరసన తెలిపారు. అమిత్‌షా రాజీనామా చేయాలని నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి మల్లికార్జునరెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంజయ్‌కుమార్, అల్లాఉద్దీన్, హుస్సేన్‌బాషా, ఇర్ఫాన్, సుజాత తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

గోపాలమిత్రల శ్రమ దోపిడీ

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్

నెల్లూరు (వైద్యం), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు మారినా గోపాల మిత్రలు శ్రమ దోపిడీకి గురవుతూనే ఉన్నారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ విమర్శించారు. గురువారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో గోపాల మిత్ర సంఘం ప్రథమ వార్షికోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో గోపాలమిత్రలు పనిచేస్తున్నారన్నారు. వారి గౌరవ వేతనం కూడా నేటికి పెరగలేదన్నారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని గోపాలమిత్రల సంఘం గౌరవాధ్యక్షురాలు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ కోరారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్రల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు నర్సయ్య, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, వెంకటేశ్వర్లు, కోశాధికారి షేక్ యాసిన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ

ప్రభుత్వ వైద్య కళాశాలలో డిప్లమో కోర్సులకు
దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (వైద్యం) జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో డిప్లమో కోర్సులకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగ రాజమన్నార్ ఓ ప్రకటనలో కోరారు. జిల్లావారే కాకుండా ఇతర జిల్లాల అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 28వ తేదీ వరకు కళాశాల పనివేళల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారని, దరఖాస్తు రుసుము రూ.100గా నిర్ణయించినట్లు తెలిపారు.



పెంచలకోనలో విస్తృత ఏర్పాట్లు

కావలి టౌన్ : ప్రత్యేక అలంకరణలో ఆలయ ముఖద్వారం సెట్టింగ్



రాపూరు : పెంచలకోనలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేసిన ఆలయ కమిటీ

రాపూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి సందర్భంగా పెంచలకోన క్షేత్రంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉత్తర వైకుంఠ వాకిలిని ఏర్పాటు చేసి, పలు రకాల పూలతో అలంకరించారు. ఏటా ఉత్తర వాకిలి గుండా సుమారు 2వేల మంది దర్శించుకుంటారని, ఈఏడాది భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. తరలివచ్చే భక్తులకు అన్నదానం, మంచి నీటి సర ఫరా తదితర సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వైకుంఠ ద్వారం ఏర్పాటు

● తిరుమలను తలపించేలా..

కావలి టౌన్ : తిరుమలలోని శ్రీవారి ఆలయాన్ని తలపించేలా స్థానిక బృందావన కాలనీలోని శ్రీవెంకటేశ్వ రస్వామి ఆలయంలో ఏర్పాట్లు చేశారు. ఆలయ ముఖ ద్వారం ఆకర్షణీయంగా నిలవగా ధ్వజస్తంభం, బలిపీఠం వివిధరకాల పూలతో చేసిన అలంకరణ కనువిందు చేస్తోంది. దీనికితోడు ప్రత్యేక విద్యు ద్దీపాలం కరణ, ప్రత్యేక సెట్టింగ్‌లు ఆకట్టుకుంటున్నాయి. తెల్లవారు జామున 4గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం జరుగుతుందని ఆలయ వ్యవ స్థాపక అధ్య క్షుడు శ్రీరామ్ మాల్యాద్రి తెలిపారు. ఉదయం 7.30గంటల నుంచి చక్రస్నానం జరుగుతుందని పేర్కొన్నారు.



కావలి టౌన్ : ధ్వజస్తంభానికి పూలాలంకరణ

ప్రసన్నుడికి నూతన వస్త్రాల సమర్పణ

కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి ఉత్సవాలకు ఏర్పాటు పూర్తిచేశారు. అలాగే సీఎల్‌పురం కోదండ రామాలయంను విద్యుత్ దీపాలతో అలంకరించారు. వేంకటేశ్వర స్వామికి మునునూరువాసి మన్నె మాల గోవిందరెడ్డి నూతన వస్త్రాలను తీసుకొచ్చి ఆలయ ఈవో రాధాకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దాత కుంటుంబసభ్యులు ఉన్నారు.

- బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి)



అధికారుల అలసత్వంతో
ఖజానాకు గండి

● వేల టన్నుల్లో తొలగించిన ఇనుప సామగ్రి ● తుప్పు పడుతున్న వైనం

సంగం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అధికారుల అలసత్వం వల్ల ఖజానాకు భారీ గండి పడుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. సంగంలో సోమశిల ప్రాజెక్టు, నెల్లూరు సెంట్రల్ డివిజన్ కింద రెండు ఇరిగేషన్ సెక్షన్‌లున్నాయి. ఈ రెండు సెక్షన్ల పరిధిలో కొన్ని సంవత్సరాల కిందట కాలువలకు ఏర్పాటు చేసిన హెడ్ రెగ్యులేటర్లు శిథిలం కాగా వాటిని తొలగించి కొత్తవి బిగించారు. తొలగించిన ఇనుప సామాగ్రి అక్కడే నిరుపయోగంగా వదిలేశారు. ఇది వేల టన్నుల్లో ఉంటుంది. దీన్ని వేలం వేస్తే ఖజానాకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. కానీ అధికారుల అలసత్వంవల్ల నిరుపయోగంగా వదిలేయడంతో తుప్పు పట్టి మట్టిలో కలిసిపోతున్నాయి.



కావలి కాలువ వద్ద తుప్పు పడుతున్న ఇనుప సామగ్రి



సెక్షన్ కార్యాలయంలో తుప్పు పడుతున్న తీసేసిన ఇనుప సామానులు

భద్రపరచలేక తంటాలు పడుతున్న అధికారులు

సంగంలోని బెజవాడ పాపిరెడ్డి కాలువ సెక్షన్‌లో తొలగించిన షట్టర్లను అక్కడే నిరుపయోగంగా వదిలేశారు. స్థానిక సెక్షన్ అధికారులు వీటిని భద్రపరచలేక ఇబ్బందులు పడుతున్నారు. సంగం ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో కూడా ఇదేవిధంగా కొన్ని సంవత్సరాల నుంచి తొలగించిన ఇనుప షట్టర్లు, ఇతర ఇనుప సామాగ్రిని ఓ గోడౌన్‌లో భద్రపరిచారు. రెండేళ్ల కిందట సంగం బ్యారేజీ ప్రారంభించడంతో వీటితో పనిలేకుండా పోయింది. ఇవి రెండేళ్లుగా నీటిలో మగ్గుతూ తుప్పు పడుతున్నాయి. ఐదేళ్లకోసారి సెక్షన్ పరిధిలో అధికారులు బదిలీ అయి చార్జ్ తీసుకున్నపుడు వీటివల్ల తంటాలు తప్పడంలేదు. ప్రతి ఇనుప బోల్టు లెక్కించాల్సి వస్తోంది. చార్జ్ తీసుకోవడం వారం రోజుల తతంగంగా మారింది. ఇది తలకు మించిన భారంగా మారిందని కొత్తగా వచ్చిన అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏడాది కిందట ఓ ఈఈ గమనించి వీటిని వేలం వేసేందుకు ప్రతిపాదనలు పంపమని ఆదేశించారు. కానీ సెక్షన్ అధికారి ఆదిశగా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వృథాగా ఉన్న ఇనుప సామాగ్రిని బహిరంగ వేలం వేస్తే ఖజానాకు ఆదాయం చేకూరుతుందని స్థానికులు అంటున్నారు.

మూడు బైక్‌లను ఢీకొన్న కారు

● ఐదుగురికి తీవ్రగాయాలు

పొదలకూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు - నెల్లూరు మార్గంలో తోడేరు బ్రాంచి రోడ్డు సమీపంలో గురువారం జరిగిన ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పొదలకూరు నుంచి నెల్లూరుకు వెళుతున్న కారు, ముందు వెళ్తున్న మూడు బైకులను ఢీకొంది. దీంతో బైకుల్లో ప్రయాణిస్తున్నవారితోపాటు కారులో ఉన్న ఇద్దరికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ షేక్.హనీఫ్ సంఘటనా స్థలానికి చేరుకుని, గాయపడినవారిని పొదలకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కోళ్ల వ్యర్థాలు తరలించే వాహనాల పట్టివేత

కోవూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రొయ్యల చెరువుల గుంతల్లో వేసేందుకు కోడి మాంసపు వ్యర్థాలను తరలిస్తున్న ఆరు వాహనాలను గురువారం ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆక్వా రైతులు కోడి మాంసపు వ్యర్థాల్ని రొయ్యలకు ఆహారంగా వేయడం తగదన్నారు. అలా చేసే రైతులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. సర్కిల్ పరిధిలోని ఇలాంటి సంఘటనలు ఉండే సమాచారం ఇవ్వాలన్నారు.



కోవూరు పోలీసుస్టేషన్ ఆవరణలో ఉన్న కోడి మాంసపు వ్యర్థాలు తరలించే వాహనాలు

వృద్ధుడి హత్య కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైం), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వృద్ధుడి హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరులోని తూకుమాన్‌మిట్ట ప్రాంతంలోని పెన్నానది సమీపంలో ఎండీ అహ్మద్ రసూల్(65) ఒంటరిగా జీవిస్తున్నాడు. ఆయన గుప్తాపార్కు దగ్గరల్లోని మోడల్ స్కూల్ వద్ద సైకిల్ మెకానిక్‌షాపు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి ఆయన ఇంట్లోనే దారుణ హత్యకు గురయ్యాడు. సంతపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతికత ఆధారంగా నిందితులు ఈద్గామిట్ట గోపి టీ సెంటర్ ప్రాంతానికి చెందిన షేక్ రఫీ, సల్మాన్‌గా గుర్తించారు. స్థానిక ఎస్‌ఐ బాలకృష్ణ గురువారం ఉప్పరపాలెంలో నిందితులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. రఫీ, సల్మాన్ తరచూ రసూల్ ఇంటి సమీపంలో మద్యం సేవించే వారు. దీనిపై వారిని రసూల్ హెచ్చరించారు. ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి కూడా మద్యం సేవిస్తుండగా రసూల్ అడ్డుకోవడంతో ఆయనను హత్య చేసినట్లు నిందితులు విచారణలో వెల్లడించారు. ఎస్‌ఐ బాలకృష్ణ నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	120
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	218
స్కిన్‌లెస్	240
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7489
వెండి కిలో ధర	రూ. 92,300
వెండి ఒక గ్రాము	రూ.95.30

వివాహిత ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఆచారి వీధిలో గురువారం ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. సేకరించిన వివరాల మేరకు... ఆచారివీధిలో సురేష్, దుర్గా(32) దంపతులు నివసిస్తున్నారు. దుర్గా గురువారం తన ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను రామచంద్రారెడ్డి వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. అనారోగ్య కారణాలతో బలవన్మరణానికి పాల్పడినట్లు దుర్గ భర్త పోలీసు లకు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తొలగని అడ్డంకులు

● ఉత్తర కాలువపై యథాతథంగా పాత నిర్మాణాలు
● అక్రమంగా మోటార్ల ఏర్పాటు
● నీటి పారుదలకు ఆటంకాలు

అనంతసాగరం జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సోమశిల ఉత్తర కాలువ మనుగడ ప్రశ్నార్థంగా మారింది. కాలువలో ఉన్న అడ్డంకులు నీటి పారుదలకు ఆటంకం కలిగిస్తున్నాయి. ఇక మొదటి పంటకు నీరు ఇచ్చే ముందు కూడా కాలువలో ఎలాంటి పనులు చేయక పోవడం గమనార్హం. సోమశిల జలాశయం నీటి కేటాయింపుల్లో ఉత్తర కాలువ పరిధిలో 50 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఏటా మొదటి పంట సమయంలో ఆయకట్టుకు నీరు ఇస్తారు. ఇక రెండో పంట సమయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారిస్తారు. అయితే గత వైసీపీ పాలనలో ఉత్తర కాలువ మనుగడపై పాలకులు, అధికారులు శ్రద్ధ చూపలేదు. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

● సామర్థ్యం పనులపై శ్రద్ధ ఏదీ ?

ఉత్తర కాలువ సామర్థ్యం పనులపై గత వైసీపీ హడావుడి చేసింది. 750 క్యూసెక్కుల ఉన్న సామర్థ్యాన్ని 1,550 క్యూసెక్కులుగా పెంచాలని నిర్ణయించారు. అంత వరకు బాగానే ఉన్నా చేపట్టాల్సిన పనులపై మాత్రం శ్రద్ధ చూపలేదు. భూసేకరణతోపాటు, నిధుల మంజూరులో వైఫల్యంతో ఐదేళ్లపాటు పనులు చేయకనే చేతులెత్తేశారు. ఇక పాత నిర్మాణాలు అలాగే వదిలేయడంతో మొదటి పంట సమయంలో నీటి పారుదలకు ఆటంకంగా మారాయి. కెనాల్‌ను వెడల్పు చేయడంతో పాటు బెడ్‌నిర్మాణం, లైనింగ్ పనులు చేయాల్సి ఉండగా ఆదిశగా పనులు జరగలేదు. ఇది ఇలా ఉంటే డిస్ట్రిబ్యూటరీ కాలువల పరిస్థితి దయనీయంగా ఉంది. వాటిని సరిచేసి ఉప కాలువల పరిస్థితి సరిదిద్దేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



ఉత్తర కాలువ 10వ కి.మీ వద్ద పాత వంతెన

● రాళ్లపాడుకు సరిగా అందని నీరు

ఉత్తర కాలువ కందుకూరు నియోజకర్గంలోని రాళ్లపాడు రిజర్వాయర్ (106 కి.మీ) వరకు విస్తరించి ఉంది. అయితే నామమాత్రంగా పనులు చేయడంతో రాళ్లపాడుకు సమృద్ధిగా నీరు అందని పరిస్థితి. అంతేకాక కాలువపై అక్రమ మోటార్ల బెడద ఎక్కువగా ఉంది. కొందరు భూస్వాములు కాలువ పరిధిలో అధిక మొత్తంలో పొలాలు కొని వాటిని మోటార్ల కింద సాగు చేస్తున్నారు. ఒక వైపు డిస్ట్రిబ్యూటరీ కాలువల ద్వారా నీరు అందిస్తున్నా, అక్రమ మోటార్ల తొలగింపు మాత్రం జరగలేదు.



కాలువకు అక్రమంగా అమర్చిన మోటారు

ఉపాధి హామీ అక్రమాలపై విచారణ

కలువాయి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఉపాధిహామీ పనుల్లో తవ్వేకొద్ది అవినీతి, అక్రమాలు బయటపడుతున్నాయి. చిన్నగోపవరంలో జరిగిన అక్రమాలకు బాధ్యులైన వారిపై ఉన్నాతాధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. తాజాగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చింతలపాళెంలో జరిగిన అక్రమాలపై గురువారం డ్వామా అంబుడ్స్ పర్సన్ వెంకటరెడ్డి విచారణ జరిపారు. క్షేత్ర సహాయకుడు మస్తాన్‌బాబు నిబంధనలకు విరుద్ధంగా జాబ్‌కార్డులు మంజూరు చేసి నిధులు దుర్వినియోగం చేసినట్లు అందిన ఫిర్యాదు మేరకు పలువురు కూలీలను, గ్రామస్థులను ఆయన విచారించారు. 2023-24 సంవత్సరంలో ఒకే కుటుంబ సభ్యులకు విడివిడిగా సింగిల్ జాబ్‌కార్డులు మంజూరు చేయడంతో పాటు ఏడాదిలో 100రోజుల పనిదినాలు పూర్తయిన కుటుంబాల జాబ్‌కార్డులు డిలిట్ చేసి మళ్లీ వారిపేర్లతోనే కొత్త జాబ్‌కార్డులు తయారు చేసినట్లు, జాబ్‌కార్డులలో గ్రామంలో లేనివారి పేర్లు కూడా నమోదు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపిన అంబుడ్స్ పర్సన్ ప్రాథమికంగా అక్రమాలు జరిగినట్లు గుర్తించినట్లు తెలిసింది. ఈవిషయమై అంబుడ్స్ పర్సన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించనున్నట్లు తెలియజేశారు.



కలువాయి మండలం చింతలపాళెంలో విచారణ జరుపుతున్న డ్వామా అంబుడ్స్ పర్సన్ వెంకటరెడ్డి

కూటమి ప్రభుత్వంలోనే క్రీడాభివృద్ధి


● భారత పారా అథ్లెట్ భవాని

నెల్లూరు(విద్య), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్రంలో క్రీడాభివృద్ధి జరుగుతోందని, ఎంతోమందిని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని భారత పారా అథ్లెట్ భవానీ అన్నారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ పోటీ ల్లో భారత జట్టు తరఫున పాల్గొని 100 మీటర్ల పరుగు, షార్ట్‌పుట్ పోటీల్లో రజత పతకం సాధించానని చెప్పారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ప్రోత్సాహక నగదు అందించిందన్నారు. శాప్ ఛైర్మన్ రవి నాయుడు చొరవ తో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ద్వారా మరింత ప్రోత్సాహం అందించారని తెలిపారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోనే కోచ్ జసీమ్ శిక్షణలో సాధన చేసి అంతర్జాతీయ స్థాయికి ఎదిగినట్లు చెప్పారు. డీఎస్‌డీవో ఆర్‌కే యతిరాజ్ మాట్లాడుతూ జిల్లాకు చెందిన క్రీడాకారిణి అంతర్జాతీయ వేదికలో సత్తా చాటడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడా పాలసీలను ఔత్సాహితులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశం లో పారా క్రీడల అసోసియేషన్ అధ్యక్షుడు మాల్యాద్రి నాయుడు, కార్యదర్శి యాదగిరి, జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి గురుప్రసాద్, డీఎస్‌ఏ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, పారా క్రీడాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న క్రీడాకారిణి భవానీ

జడ్పీలో ఉద్యోగోన్నతులు



సన్మానం అందుకున్న జడ్పీ ఉపాధ్యాయులతో ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో విద్యారమ, ఇతర అధికారులు

నెల్లూరు (జడ్పీ), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్‌లో పలువురికి ఉద్యోగోన్నతి లభించింది. ఒకరికి కార్యాలయ పరిపాలన అధికారిగా, నలుగురికి సీనియర్ సహాయకులు, ఐదుగురికి జూనియర్ సహాయకులుగా, ఒకరికి టైపిస్టుగా పదోన్నతి కల్పించారు. అలాగే కారుణ్య నియామకాల కింద ఒకరికి జూనియర్ సహాయకులుగా నియమిస్తూ జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో విద్యా రమ, డిప్యూటీ సీఈవో మోహన్‌రావు గురువారం ఉత్తర్వులు అందజేశారు. ప్రజా సేవలో మరింత కష్టపడి పని చేసి జడ్పీకి మంచి పేరు తీసుకురావాలని అరుణమ్మ సూచించారు. ఉద్యోగోన్నతి కల్పించడంపై పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం నాయకులు పెంచలయ్య, రమేష్ హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం

జిల్లా పరిషత్ పాఠశాల్లో చదివే 10వ తరగతి విద్యార్థుల కోసం విజయదీపిక పేరుతో స్టడీ మెటీరియల్‌ని రూపొందించిన ఉపాధ్యాయులను ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ గురువారం సన్మానించారు. జడ్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మా ట్లాడుతూ ఈ ఏడాది మార్చిలో జరిగే పదోతరగతి పరీక్షలకు 15,597 మంది విద్యార్థులు సమాయత్తమవు తున్నారని తెలిపారు. వారందరూ మంచి ఫలితాలు సాధించేలా 40 మంది ఉపాధ్యాయులు కలిసి స్టడీ మెటీరియల్ రూపొందించారని తెలిపారు. వీటిని విద్యార్థులకు అందిస్తున్నామని చెప్పారు. కాగా, జాతీయ స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైన తోటపల్లి గూడూరు మండలం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు కీర్తిశ్రీ, రాజశ్రీలను జడ్పీ ఛైర్‌పర్సన్ అభినందించారు.

సోమశిలలో 71.230 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి గురువారం 1,941 క్యూసెక్కుల ప్రవాహం నమోదైంది. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 71.230 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టా కు 2,050, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రేపు మానవ హక్కుల కమిషన్ సభ్యురాలి రాక

నెల్లూరు (హరనాథపురం), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి సాయని శనివారం జిల్లాకు రానున్నారు. సాయంత్రం 4గంటలకు నెల్లూరుకు చేరుకుంటారని, 15వ తేదీ వరకు జిల్లాలో బస చేసి 16వతేదీ ఉదయం బయలుదేరి తిరుపతికి వెళతారని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి.

పీఎంఏజేఏవైను సద్వినియోగం చేసుకోండి

● డీఆర్‌డీఏ పీడీ నాగరాజ కుమారి

నెల్లూరు (హరనాథపురం), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పీఎం ఏజేఏవై పథకాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు జీవనో పాధిని పెంచుకోవాలని డీఆర్డీఏ పీడీ నాగ రాజకుమారి సూచించారు. ఈ పథకంపై డీఆర్డీఏ సమావేశ మందిరంలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. పీడీ మాట్లాడుతూ పీఎం ఏజేఏవై పథకం కింద రుణాలు ఇస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకుని తిరిగి సకాలంలో చెల్లించాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నిర్మలా దేవి మాట్లాడుతూ గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలను మగవారికి ఇచ్చేవారని, ప్రస్తుతం పొదుపు మహిళకూ రుణాలు అందజేస్తున్నారన్నారు.

వీఎస్‌యూ అభివృద్ధిపై సమీక్ష




సమీక్షలో మాట్లాడుతున్న వీసీ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) అభివృద్ధికి సంబంధించి ప్రాజెక్టుల పురోగతిపై గురువారం వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వర్సిటీలోని విభాగాల ప్రగతి, పరీక్షల నిర్వహణ, విద్యార్థులకు అందించే సేవలు, కొత్త ప్రణాళికల అమలు గురించి చర్చించారు. ముఖ్యంగా పరీక్షల సంస్కరణలు, ఫలితాలు వేగవంతంగా విడుదల, డిజిటల్ ఇనిషియేటివ్‌లు, పారదర్శకత కల్పనపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి, డీన్ సీడీసీ డాక్టర్ ఎం హుస్సేనయ్య, ఐక్యూఏసీ డైరెక్టర్ అందె ప్రసాద్, కేవీఎస్‌ఎన్ జవహర్‌బాబు, ఆర్ ప్రభాకర్, జీ రామకృష్ణ పాల్గొన్నారు.

ఆడపిల్లల భవితకే 'కిశోరి వికాసం'

● రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు షేక్ రుకయా బేగం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రుకయా బేగం

నెల్లూరు (హరనాథపురం), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఆడపిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం కిశోరి వికాసం కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు షేక్ రుకయా బేగం అన్నారు. గురువారం నెల్లూరులోని మహిళా ప్రాంగణంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'కిశోరి వికాసం'పై మండలస్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు, మహిళల అభివృద్ధికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. కిశోరి వికాసం పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సుజాత, అర్బన్ సీడీపీవో లక్ష్మీదేవి, బాలల సంరక్షణ అధికారి సురేష్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

గొలగమూడిలో రెండిళ్ల దగ్ధం

వెంకటాచలం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని గొలగమూడి ఎస్టీకాలనీలో గురువారం సాయంత్రం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. స్థానికుల కథనం మేరకు, కాలనీకి చెందిన నలాబాయ్ రమణయ్య, ఆయన కుమారుడు పక్క పక్క ఇళ్లలో ఉంటున్నారు. అయితే ఈ రెండిళ్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదానికి గురయ్యా యి. క్షణాల్లో మంటలు వ్యాపించడంతో గృహోప కరణాలు కాలి బూడిదయ్యాయి. చుట్టు పక్కల వారు అప్రమత్తమై మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక శాఖకు సమా చారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2లక్షలకుపైగా ఆస్తి నష్టం జరిగిం దని బాధితుడు రమణయ్య తెలిపారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

కలిగిరి, జనవరి, 9 (ఆంధ్రజ్యోతి): జంతు హింస చట్టాన్ని ఉల్లంఘించి ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు రవీంద్రబాబు తెలిపారు. కలెక్టరు ఆదేశాల మేరకు మండల, గ్రామస్థాయి అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. కోడిపందేలు నిర్వహిస్తే స మచారాన్ని స్థానిక కమిటీ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

రేపటి నుంచి జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

కావలి టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అండర్-17 అండర్-23 జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు శని, ఆదివారాలు కావలి పట్టణ విట్స్ ఇంజనీరింగ్ కళాశాల పక్కనున్న మిని స్టేడియం శాప్ సబ్ సెంటర్‌లోని క్రికెట్ నెట్స్ వద్ద జరగనున్నట్లు ఏపీ క్రికెట్ అసోసియే షన్ కోచ్ రాజశేఖర్ కావలి క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు సిద్దు తెలిపారు. గురువారం మిని స్టేడియం శాప్ సబ్ సెంటర్‌లోని క్రికెట్ నెట్స్ వద్ద విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులందరూ విధిగా ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకుని వైట్అండ్‌వైట్ డ్రస్సు కిట్స్‌తో రావాలన్నారు. ఎంపికైన జట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి లిఖిలేశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో జిల్లా క్రికెట్ అసోసి యేషన్ వారు నిర్వహించే జిల్లా లీగ్ పోటీల్లో పాల్గొంటాయన్నారు. ఈ లీగ్‌లోని ప్రతిభ క్రీడాకారులను జిల్లా జట్లుకు ఎంపిక చేస్తారన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ఉలవపాడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం విజిలెన్స్ దాడులు గురువారం దాడులు నిర్వహించినట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులు తెలిపారు. 34బృందాలుగా 2,500సర్వీసులు తనిఖీ చేసి విద్యుత్ చౌర్యం చేస్తున్న 17మందితో పాటు మరో 3సర్వీసులు మాల్‌ప్రాక్టీస్ కింద కేసులు నమోదు చేశామన్నారు. అధికలోడు వాడుతున్న 150మందికి నోటీసులు ఇచ్చామన్నారు. వీరికి రూ.8,01,000 జరిమానా విధించినట్లు తెలిపారు. తనిఖీలు నిర్వహించిన వారిలో విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు హైమావతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యుగంధర్, కందుకూరు డివిజన్ విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ప్రపంచ కవి సమ్మేళనంలో జమున ప్రతిభ

కావలి టౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో జరిగిన ప్రపంచ మహాకవి సమ్మేళనంలో కావలి విశ్రాంత ఉపాధ్యాయురాలు ఎం.జమున ప్రతిభ చూపి ఉత్తమ కవిగా ఎంపికై సర్టిఫికెట్‌తో పాటు మెమొంటోను అందుకుంది. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో కన్వీనర్ చైతన్యరాజు ఆధ్వర్యంలో జరిగిన సమ్మేళనంలో ఆమె పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై అందించిన ఈమె రాసిన కవిత్వం ఉత్తమ కవిత్వంగా ఎంపికైంది. ముఖ్య అతిథి పాల్గొన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, చైతన్యరాజులు కవి సమ్మేళన కన్వీనర్ ప్రసాద్‌లు ప్రశంసించారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

లింగసముద్రం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కిషోరి బాల వికాసంలో పాల్గొని కిషోరి వికాసం పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. మాలకొండ పుణ్యక్షేత్రంలో బాల్య వివాహాలు జరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, దేవాదాయశాఖ అధికారులు జనన ధృవీకరణ పత్రం తీసుకొని వివాహాలు జరిపించాలన్నారు. అనంతరం కేఆర్ జడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. మహిళా సమాఖ్య కార్యాలయంలో వయోజనులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉలవపాడు సీడీపీఓ అరుణ, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ శివకుమార్, ఏపీఎం సింహాద్రిరావు, సూపర్ వైజర్ ఏవీ రాధాదేవి, హెచ్‌ఎం మాధవరావు పాల్గొన్నారు.

పరిధి దాటితే చర్యలు : సీఐ

ఆత్మకూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారి వెంబడి షాపులకు కేటాయించిన హద్దులు దాటి రోడ్డుపై వస్తువులను పెడితే వారిపై చర్యలు చేపడతామని సీఐ గంగాధర్ తెలిపారు. గురువారం ఆయన ఎస్‌ఐ షేక్ జిలాని, సిబ్బందితో కలిసి సోమశిల రోడ్డు సెంటర్ నుంచి సత్రం సెంటర్ వరకు పర్యటించి షాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా షాపుల ఎదుట నిర్మించి ఉన్న కాలువను దాటి రోడ్డుపై వస్తువులు, బోర్డులను, వాహనాలను నిలిపి ఉన్న వారిని హెచ్చరించి వాటిని తొలగించారు.

లక్ష్యాలను అధిగమించాలి

ఉదయగిరి, జనవరి 9(ఆంధ్రజ్యోతి):ఉపాధి హామీ పథకానికి సంబంధించిన లక్ష్యాలను సిబ్బంది అధిగమించాలని ఎంపీడీవో అప్పాజీ పేర్కొన్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి పంచాయతీలో 25ఫారంపాండ్స్, రెండు గోకులం షెడ్‌లు, అమృత్ సరోవర్ ట్యాంకు, ఫిష్ పాండ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసరావు, ఎఫ్‌ఏలు, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

విధులపై అవగాహన

ఉదయగిరి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఈవో కార్యాలయంలో గురువారం ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సీఆర్‌ఎంటీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సెలవుల్లో వారు చేయాల్సిన విధులపై అవగాహన కల్పించారు.

నివాసాల మధ్య నిరుపయోగ బావులు

● పట్టించుకోని మున్సిపల్ అధికారులు

కావలి రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చేవూరివారి తోటలోని వాసాల మధ్య ఉండే మున్సిపల్‌బావి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. నాడు పట్టణవాసుల గొంతు తడిపేందుకు వైకుంఠపురంలోని చేవూరివారితో ట ప్రాంతంలోని మున్సిపల్ బావులే ఆధారం ఉండేవి. ఒక బావిని మరో బావిని అనుసంధానం చేస్తూ డైరెక్ట్ పంపింగ్, ట్యాంకర్లతో నీటి సరఫరా చేసేవారు. కాలక్రమేణ ఓవర్‌హెడ్ ట్యాంకుల నుండి పైప్ లైన్లతో నీటి సరఫరా జరగడంతో ఈ బావుల వాడకం తగ్గించారు. ప్రస్తుతం ఈ బావి చుట్టూ ఉన్న గోడలు దెబ్బతిని కోల్పోవడంతో అధికారులు చిన్నపాటి మరమ్మతులు కూడా చేపట్టలేదు. పరిసర ప్రాంతాలు కూడా కంపచెట్లు, చెత్తచెదారాలతో నిండిపోయాయి. పట్టణంలోని బాలక్రిష్ణారెడ్డినగర్‌లో జనవరి 3న పోనమల్లి చక్రధర్ టవర్‌గుంటలో పడి విద్యార్థి మృతి చెందిన విషయం తెలిసిందే. అధికారులు, పాలకులు బావుల వద్ద ముందస్తు చర్యలు తీసుకోక పోవడంతో పట్టణవాసులు ఆందోన చెందుతున్నారు.


కంపచెట్లతో ప్రమాదకరంగా ఉన్న బావి

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

కావలి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 10మంది లబ్ధిదారులకు గురువారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి రూ.9,88,831ల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ముసునూరు పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్‌బాబు, టీడీపీ రాష్ట్రకార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ పోతుగంటి అలేఖ్య , గుడిపల్లి నారయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కావలి తాలూకా యూనిట్ 2025వ సంవత్సర క్యాలెండర్‌ను గురువారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆవిష్కరించారు. స్థానిక ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంఘం ప్రెసిడెంట్ నాగిశెట్టి శ్రీనివాసులు, కార్యదర్శి ఎస్. శ్రీధర్‌బాబు, ఉపాధ్యక్షులు సీహెచ్ సుకుమార్ బాబు, సతీష్, జాయింట్ సెక్రటరీలు శ్రీహరిబాబు. చలపతిరావు, రమేష్‌నాయుడు, సుధాకర్ పాల్గొన్నారు.



మార్చి నెలాఖరుకు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

● సీహెచ్.వెంకటేశ్వర్లు, ఏఈ, గృహ నిర్మాణ శాఖ, అల్లూరు



ఇంటర్వ్యూ...

అల్లూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మార్చి నెలాఖరులోగా గతంలో మంజూరైన గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని లేనిపక్షంలో నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందని గృహ నిర్మాణ శాఖ మండల ఏఈ సీహెచ్.వెంకటేశ్వర్లు తెలిపారు. గతంలో నిర్మాణాలు పూర్తి చేసిన వారికి ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుందన్నారు.

? ఎన్టీఆర్ గృహకల్ప నిధులు మంజూరవుతాయా

! ప్రస్తుతానికి గత ప్రభుత్వంలో నిలిచిన బి ల్లులు మాత్రమే మంజూరవుతున్నాయి. ఇవి పూర్తయి అనంతరం ఎన్టీఆర్ గృహకల్ప బిల్లులు మంజూరయ్యే అవకాశం ఉంది.

? వారి బిల్లుల పరిస్థితి ఏంటి.

! ఇప్పటికే ఆ పథకం ద్వారా ఎంపికైన లబ్ధిదారుల వివరాలు సేకరించాం. ఆయా దశల్లో గృహాలు నిలిచిపోయాయి. అలాంటి వారి వివరాలు సిద్ధం చేసి ఉంచాం. ప్రభుత్వం వివరాల అడిగితే వెంటనే ఇచ్చేస్తాం. .

? కొత్తగృహాల మంజూరుకు అవకాశం ఉందా.

!. నూతన గృహాలకు అర్హత కలిగిన లబ్ధిదారుల నుండి వారి వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. నేటికీ స్వీకరిస్తూనే ఉన్నాం. ఆన్‌లైన్ ఎప్పుడు ఆగిపోతుందో తెలియదు. అప్పటివరకు తీసుకుంటాం. పాతవన్నీ పూర్తయితే అవకాశం .

? ఇళ్ల రుణాలు లబ్ధిదారుడికి ఎంత వచ్చే అవకాశం.

! ప్రస్తుతానికి రూ2.50 లక్షలు అని మాత్రమే ప్రకటనలు వెలువడ్డాయే తప్ప స్పష్టత ఇప్పటి వరకు ఇవ్వలేదు. అధికారిక ఉత్తర్వులు వెలువడితేగానీ చెప్పలేం. మార్చి తరువాతి నెలల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

ముక్కోటి ఏకాదశికి ఆలయాల ముస్తాబు

● ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి

ఆత్మకూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీదేవి భూదేవి సమేత అలఘనాథస్వామి ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఆలయాల ముంగిట చలువ పందిళ్లు వేశారు. శుక్రవారం వేకువజాము నుంచే భక్తులను ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటుచేశారు.


● కలిగిరి: కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఉత్తరద్వార దర్శనానికి నిర్వహకులు తగు ఏర్పాట్లు చేశారు. గరుడవాహనంపై స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు.

● లింగసముద్రం: మండలకేంద్రంతో పాటు చినపవని, వీఆర్ కోట, పెదపవని, మొగిలిచెర్ల, తిమ్మారెడ్డి పాలెం, జంగంరెడ్డిపాలెం, విశ్వనాథపురంలోని ఆలయాలను ఆలయ కమిటీ సభ్యులు అందంగా ముస్తాబు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. లింగసముద్రంలో శుక్రవారం సాయత్రరం 6గంటల నుంచి శనివారం ఉదయం 8గంటల వరకు అర్ధ ఏకాహం, పెదపవనిలో 10వ తేదీ ఉదయం 10గంటల నుండి 11వ తేదీ ఉదయం 9గంటల వరకు హరే రామ నామ సంకీర్తన, ఏకాహం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

● కందుకూరు: పట్టణంలోని ఆలయాల్లో భక్తులకు ఉత్తరద్వార దర్శన ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్కంధపురి జనార్దనస్వామి ఆలయంలో భక్తులకు తూర్పురాజగోపుర ద్వారం వద్ద దర్శన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ బైరాగిచౌదరి తెలిపారు. ఉదయం 5గంటల నుంచే భక్తులకు దర్శనానికి వదులుతామని చెప్పారు. స్థానిక రెవెన్యూ కాలనీలోని కోదండరామాలయంలో ఏర్పాట్లు చేసినట్లు ఆలయ పూజారి గుంటూరి శ్రీనివాసమూర్తి తెలిపారు.


బిట్రగుంట: విద్యుత్ దీపాలంకరణలో కోదండరామాలయం


లింగసముద్రం: ముస్తాబైన కోదండరాముడి ఆలయం


స్కంధపురి జనార్దనస్వామి ఆలయ తూర్పురాజగోపుర ద్వారం


ఆత్మకూరు: ముస్తాబైన వెంకటేశ్వరస్వామి ఆలయం

న్యూస్ బాక్స్

ప్రధాని సురక్షిత మాతృత్వ పథకం వరం

కావలి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ పథకం గర్భవతులకు వరమని గైనకాలజిస్ట్ లక్ష్మీ తెలిపారు. డాక్టర్ రాంసెంటర్ విశ్వోదయ సహకారంతో రాజీవ్‌నగర్ అర్బన్‌హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం గర్భవతులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాంసెంటర్ డైరెక్టర్ తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, హెల్త్ సెంటర్ కమ్యూనిటీ ఆర్గనైజర్ సునీత, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నోటిఫికేషన్ వాయిదా

కందుకూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని చౌక దుకాణాలకు శాశ్వత ప్రాతిపదికన డీలర్ల నియామకం కోసం ఇటీవల జారీచేసిన నోటిఫికేషన్‌ను వాయిదా వేసినట్లు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డీలర్ల కోసం చేసిన రిజర్వేషన్లకు సంబంధించి కొన్ని గ్రామాల్లో ఆ కేటగిరి ప్రజలు లేరన్న ఫిర్యాదులతో వాయిదా వేసినట్లు.. తిరిగి రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తిచేశాక నోటిఫికేషన్ జారీచేస్తామని పేర్కొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

కావలి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మాతినవారిపాలెంలో మద్యం సీసాలు అమ్ముతున్న సందు రామయ్యను గురువారం అరెస్ట్ చేసి 10మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు సీఐ చెప్పారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ఏఎస్ పేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గుంపర్లపాడు హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు చిన్నాబత్తిన శివకుమార్‌ను గురువారం ఎంఈవో జ్యోతి ఆధ్వర్యంలో సన్మానించారు. 2024 సంవత్సరంలో సాధారణ సెలవులను ఒక్కటి కూడా వినియోగించకుండా సేవలు అందించినందుకు ఆయనను ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు.

దత్తత తీసుకోండి

ఏఎస్ పేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యాలను బట్టి ఎ,బి,సి,డి గ్రూపులుగా విభజించి డిగ్రూపు విద్యా ర్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకొని ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంఈవో జ్యోతి తెలిపారు. గురువారం గుంపర్లపాడు హైస్కూల్‌లో జరుగుతున్న పదవ తరగతి వందరోజుల సంసిద్ధత కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పోతులురయ్య పాల్గొన్నారు.

అండగా ఉంటాం..

బిట్రగుంట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే జనరల్ సెక్రెటరీ మర్రి రాఘవయ్య సహకారంతో రైల్వే విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉండేందుకు పెన్షనర్స్ అసోసియేషన్‌ను ప్రారంభించినట్లు సంఘం డివిజనల్ ప్రెసిడెంట్ శ్రీహరిరావు తెలిపారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయంను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు చెంచయ్య, కార్యదర్శి గోవిందరాజులు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీనివాసులు యాదవ్, రైల్వే ఉద్యోగులు, స్థానిక టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఫాతిమాకు ఘననివాళి

ఉదయగిరి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు షేక్ ఫాతిమా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్కు రమణమ్మ, హెచ్‌ఎం షేక్ నాయబ్, ఎస్‌ఎంసీ చైర్మన్ కవిత, విశ్రాంత ఉపాధ్యాయులు దస్తగిరి అహ్మద్, రామిరెడ్డి, గ్రామపెద్దలు మూలె సుబ్బారెడ్డి, నాయబ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేత ఎస్ఆర్‌జే డిగ్రీ కళాశాల జట్టు

ఆత్మకూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఆర్‌జెడి కళాశాల క్రీడా ప్రాంగణంలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల జోనల్‌స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ముగిసాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఉదయగిరి జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 7 వికెట్లకు 84 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ చేసిన ఆత్మకూరు ఎస్ఆర్‌జె డిగ్రీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 85పరుగులు సాధించి చాంపియన్‌గా నిలిచింది. ఉదయగిరి జట్టు రన్నర్‌గా నిలిచింది. అనం తరం నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఆర్ జెడి కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ రఘురామ చంద్రమూర్తి చాపియన్‌గా నిలిచిన జట్టుకు ట్రోఫీని అందజేసి అభినందించారు. కార్య క్రమంలో ప్రిన్సిపాల్ వరకుమారి, పీడీ సిరిమావిళ్ల వెంకటేశ్వర్లు, యూనివర్సిటీ పరిశీలకులు డాక్టర్ ఏ ప్రవీణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ టి శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● సంగం: అన్నారెడ్డిపాళెం పులగం మల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుంచి మండల స్థాయిలో హార్డ్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

● ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల జోనల్‌స్థాయి క్రికెట్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ నారాయణస్వామి గురువారం తెలిపారు. ఆత్మకూరులో జోనల్ క్రికెట్ ఫైనల్ పోటీల్లో ఆత్మకూరు(ఎస్ఆర్‌జే), ఉదయగిరి (ఎంఆర్ఆర్) కళాశాలల జట్లు తలపడగా ఉదయగిరి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నరసింహులు, పీడీ ఏ.రమేష్, అధ్యాపకులు ఉన్నారు.


ఎస్ఆర్‌జే డిగ్రీ కళాశాల జట్టు

సంక్షేమ హాస్టళ్లలో వసతులు కల్పించండి

● దళిత సంఘర్షణ సమితి సభ్యులు

కావలి, జనవరి9(ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్ల సంక్షోభంలో ఉన్నాయని వాటిని పరిరక్షించి వసతులు కల్పించాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి తెలిపారు. గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో కావలి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆయన నిరసన తెలిపి ఆర్డీవో సన్నీ వంశీక్రిష్ణకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో 90 వేల మంది దళిత, గిరిజన బిడ్డలు హాస్టళ్లలో దుర్భర జీవితం గడుపుతున్నారని వాపోయారు. దోమల నివారణకు దోమ తెరలు, గదులకు తలుపులు, కిటికీలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పౌష్టికాహారం అందక అనారోగ్యం బారిన పడుతున్నట్లు తెలిపారు. దుప్పట్లు, నోట్‌పుస్తకాలు ఇవ్వలేదని అధికారులు ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి హాస్టళ్ల సమస్యలు పరిష్కరించకపోతే కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో దళితసంఘర్షణసమితి నేతలు జరుగుమల్లి విజయరత్నం, వెంకటశేషయ్య, అంచిపాక రత్నం పాల్గొన్నారు.

ఆక్రమించారంటున్న ప్రభుత్వ భూమి చూపండి

● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తాను 128 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమించానంటూ టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలు రుజువు చేయలేకపోయారని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం ముసునూరులోని ఆయన నివాసంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ భూములు ఎక్కడున్నాయే గుర్తించి స్వాధీనం చేసుకోవాలని తప్పుచేసి వుంటే చర్యలు తీసుకోవాలని గతంలో తాను ఛాలెంజ్ చేసిన విషయం గుర్తుచేశారు. టీడీపీ నాయకుల బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. కూటమిని గెలిపించి తప్పు చేసామన్న భావన ప్రజల్లో ఉన్నారని రాబోయేది వైసీపీ ప్రభుత్వమే అని జోస్యం చెప్పారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యేకు తెలియకుండా ఐవోసీ పెట్రోల్ బంకు ఏర్పాటుకు పనులు ప్రారంభించారంటే ఎవ్వరూ నమ్మరని ఎద్దేవా చేశారు. టీడీపీ నేతలు తమపై బురద చల్లడం తగదన్నారు. నిత్యం ప్రజలతో కిక్కిరిసి వుండే ప్రాంగణంలో పెట్రోల్ బంకు ఏర్పాటుకు అనుమతులివ్వడంపై తాము వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు.

ముందస్తు సంక్రాంతి సంబరాల ప్రారంభం

కందుకూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలు, అంగన్వాడీ కేంద్రాల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. పండుగ వైభవం ఉట్టిపడేలా ముగ్గుల పోటీలు, గొబ్బెమ్మలు, భోగిమంటలు వేయటంతో పాటు చిన్నారులపై భోగిపండ్లు పోసి సంబరాలు జరుపుకున్నారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టరు సీహెచ్ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిర్వహించిన పాటు ఫుడ్ ఫెస్టివల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. పడమర మంగళిపాలెం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించి వే డుకల్లో సీడీపీఓ శర్మిష్ఠ హాజరై చిన్నారులకు భోగిపండ్లు పోశారు. బొమ్మలకొలువు, ఎద్దులబండ్ల ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

● సీతారామపురం : స్థానిక గ్రామ పంచాయతీలోని వేదగర్భ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గురువారం స్కూల్ డైరెక్టర్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● ఆత్మకూరు: పట్టణంలోని నలంద ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో విద్యార్థులు పట్టుపంచెలు, విద్యార్థినులు పట్టు లంగాలు ధరించి ఆకట్టుకున్నారు. హరిదాసులు, గొబ్బెమ్మలు, బొమ్మల కొలువు, భోగి పండ్లు వంటివి ఏర్పాటుచేశారు. చిన్నారులు హరిదాసుల వేషాలు, సంక్రాంతి పాటలు, డ్యాన్స్‌లతో అలరించారు. కరస్పాండెంట్ ఈగ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు పండుగ విశిష్టతను తెలియజేయాలన్న ఉద్దేశ్యంతోనే ముందస్తు సంక్రాంతి సంబరాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ రత్నమ్మ, ప్రధానోపాధ్యాయుడు బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● అనంతసాగరం: కామిరెడ్డిపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు కోలాట మాడుతూ భోగిమంట వేశారు. తొలుత ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులిందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వసుందరాదేవి, మనోజ్‌కుమార్, వెంకటరమణ ఉన్నారు.

● ఏఎస్ పేట :మండలకేంద్రంతో పాటు గ్రామాలలోని హైస్కూల్స్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. స్థానిక ఠాగూర్ పాఠశాలలో భోగి మంటలు, ముగ్గులు వేసి సంబరాలు చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రమణారెడ్డి, హెచ్‌ఎం దొరస్వామిరెడ్డి పాల్గొన్నారు. గుంపర్లపాడు గ్రామంలోని హైస్కూల్‌లో ఘనంగా సంబరాలు నిర్వహించారు. 8వ తరగతి విద్యార్థిని షేక్ నదియా సోదెమ్మ వేషధారణలో ఏకపాత్రాభినయంతో ఆకట్టుకుంది. దీంతో ఎంఈవో జ్యోతి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పోతులూరయ్య పాల్గొన్నారు.

● సంగం: మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులు నూతన వస్త్రాలు ధరించి ముస్తాబై వచ్చారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగిమంటలు, గొబ్బెలు ఏర్పాటు చేశారు. పండరి భజననిర్వహించారు.

● వింజమూరు: పట్టణంలోని రవి ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ మహేష్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● కందుకూరు: కాళిదాసువారివీధిలోని కోదండరామాలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఈ ప్రాంత మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులను తీర్చిదిద్దారు. అనంతరం పోటీల విజేతలకు పాల్గొన్న మహిళలందరికీ నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

● బిట్రగుంట: కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ, డిపార్ట్మెంట్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సంయుక్తంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ పీవీఎస్‌రెడ్డి ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెడీవో సునీల్‌రెడ్డి, ఏవో ఆర్వీ రమణారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కిరన్‌కుమార్, అధ్యాపకులు ఉన్నారు.

● కొండాపురం: మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు ముగ్గులు వేసి రంగులతో అలంకరించి గొబ్బెమ్మలను ఏర్పాటు చేశారు. తాటి ఆకులు తెచ్చి భోగి మంటలను వేశారు.


బిట్రగుంట: భోగి మంట వద్ద నృత్యం చేస్తున్న విద్యార్థులు


ఏఎస్‌పేట: ఠాగూర్ పాఠశాలలో భోగి మంటలు


ఆత్మకూరు: సంబరాల్లో చిన్నారులు, ఉపాధ్యాయులు


సీతారామపురం: భోగి మంట వేసి నృత్యం చేస్తున్న విద్యార్థులు


కందుకూరు: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

పొదలకూరు, జనవరి 9 (ఆంధ్ర జ్యోతి) : పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ని ర్వహించారు. పండుగ పట్ల అవగా హన కల్పించడానికి ఈ సంబరాల ను ఏర్పాటు చేశారు. పాఠశాలలను మామిడి తోరణాలతో సుందరంగా అ లంకరించారు. విద్యార్థులంతా సంప్ర దాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. భోగి మంట వేసి, చిన్నారులపై భోగి పండ్లు పోశారు. విద్యార్థులు హరిదాసు వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. విద్యార్థినులు గొబ్బెమ్మలను పెట్టి, పాటలు పాడారు. ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజే శారు.


పొదలకూరు : చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న టీచర్లు


బుచ్చి : భోగి మంటవేసి, కోలాటం ఆడుతున్న విద్యార్థినులు

● మనుబోలు, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు శుక్రవారం నుంచి సంక్రాంతి సెలవులు కావడంతో గురువారం అన్నీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబ రాలు నిర్వహించారు. మడమనూరు ఉన్నత పాఠ శాలలో రంగవల్లులు, గాలిపటాల పోటీలను నిర్వ హించి, విజేతలకు బహుమతులు అందించారు. కా ర్యక్రమంలో హెచ్ఎం. వీవీ.రాధాకృష్ణ ఉపాధ్యా యులు పాల్గొన్నారు.


మనుబోలు : మడమనూరు ఉన్నతపాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

● బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): బుచ్చి నగర పంచాయతీ పరిధి రామచంద్రాపురంలోని ప్రాథమికోన్నత పాఠ శాలలో గురువారం నిర్వహించిన ముందస్తు భోగి సంబరాలు అలరించాయి. పలువురు బాలికలు ముగ్గులు పెట్టి అందులో భోగమంట వేసి, కోలాటం ఆడారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

ఇందుకూరుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం నందమూరి బసవతారకం మెమోరియల్ 38వ క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. మెమోరియల్ అధ్యక్షుడు జానా గిరిబాబు ఆధ్వర్యంలో పోటీలు జరుగుతున్నాయి. ముఖ్య అతిథిగా ఒకటవ డివిజన్ కార్పొరేటర్ జానా నాగరాజు పాల్గొని టోర్నమెంటును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ సతీమణి బసవతారకం పేరుతో క్రికెట్ టోర్నీ నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత క్రీడలపై మక్కువ చూపాలన్నారు. కార్యక్రమంలో మునగాల రంగారావు, కోవూరు మధు, క్రీడాకారులు, ఎన్టీఆర్ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జానా గిరిబాబు

ఉష్ణోగ్రత సరిగాలేక ముందస్తు వెన్ను

బుచ్చిరెడ్డిపాళెం,జనవరి9:(ఆంధ్రజ్యోతి): ఉష్ణోగ్రత సరిగా లేకపోవడంవల్లనే స్వల్పకాలిక రకాలయిన కేఎస్ఎం 1638, ఆర్ఎస్ఆర్ 15048 వరిపైర్లలో ముందుగా వెన్ను తీస్తున్నదని వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త సీహెచ్. లక్ష్మి తెలిపారు. గురువారం ఆమె మండలంలోని కాళయకాగొల్లు, పెనుబల్లిలో ముందుగా వెన్ను తీస్తున్న పొలాలను పరిశీలించారు. పొలంలో 25 కేజీల యూరియా, 15కేజీల పొటాష్‌ను 10రోజుల వ్యవధిలో రెండు సార్లుగా వేసుకోవాలని ఆమె రైతులకు సూచించారు. 70రోజుల పైరున్న రైతులు ఎలాంటి ఎరువులు, పురుగుమందులు వేయాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ డీ. మాధవీలత, కోవూరు ఏడీఏ సుజాత, ఎంఏవో ఎం.సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోర్టులో ఉచిత కంటి వైద్య శిబిరం

ముత్తుకూరు, జనవరి 9 (ఆంధ్ర జ్యోతి) : అదానీ కృష్ణపట్నం పోర్టు లా జిస్టిక్స్ వర్క్‌షాప్, వేర్‌హౌస్ ఎస్ఏ స్-2 కార్యాలయ భవనంలో గురువా రం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వ హించారు. ఈ సందర్భంగా పోర్టు సీ ఈవో జగదీష్ పటేల్ మాట్లాడుతూ ఉ ద్యోగుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు పో ర్టు నిబద్ధతతో కృషి చేస్తుందన్నారు. మోడరన్ ఐ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ (నెల్లూరు), అదానీ ఆక్యుపే షనల్ హెల్త్ సెంటర్ సహకారంతో నిర్వహించిన శిబిరంలో 422 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

నేడు తాగునీటి సరఫరా నిలిపివేత : ఎస్ఈ

నెల్లూరు(సిటీ), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి సరఫరాలో అంతరాయం కారణంగా శుక్రవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నగరంలోని కొత్తూరు 1,2, శ్రీలంక కాలనీ, అక్కచెరువుపాడు, కిచ్చరగుంట, బుజబుజ నెల్లూరు, చంద్రబాబు నగర్ ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలుపుతున్నట్లు కార్పొరేషన్ ఎస్ఈ రామ్మోహన్‌రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. శనివారం నీటి సరఫరా యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

నేడు న్యాయవాదులు విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పొన్నూరు న్యాయవాది బేటల ప్రకాశరావుపై అక్కడి పోలీసుల దాడికి నిరసనగా నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించాలని 'బార్' కమిటీ తీర్మానించింది. ఈ నిరసన కార్యక్రమానికి న్యాయవాదులు, న్యాయమూర్తులు సహకరించాలని బార్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది.

'ఆర్ఎస్ఆర్'లో సంప్రదాయ దుస్తుల పోటీ

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆర్ఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో మురిగిపూడి ట్రస్ట్ ఆధ్వర్యంలో చిన్నారులకు సంప్రదాయ వస్త్రధారణ పోటీలు అలరించాయి. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను నేటి తరం మరచిపోకూడదు అనే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు ఎం సతీష్‌కుమార్, మధుసూదన్‌బాబు, దోనిపర్తి సురేష్, కార్పొరేటర్ కామాక్షి పాల్గొన్నారు.

ముక్కోటి కాంతులు


బాలాజీనగర్ సీతారామమందిరంలో వైకుంఠ ద్వార దర్శన మార్గం


ముక్కోటి సందర్భంగా తల్పగిరి రంగనాథస్వామి ఆలయానికి చేసిన విద్యుద్దీపాలంకరణ, పెన్నానది జలాల్లో ప్రతిబింబం


వేణుగోపాల స్వామి ఆలయంలో అరిటాకులతో అలంకరణ


వేణుగోపాలుడి ఆలయానికి విద్యుద్దీప శోభ

ఆలయాలకు ముక్కోటి శోభ

● ఏర్పాట్లు చేసిన పాలకమండళ్లు, ఈవోలు

బుచ్చిరెడ్డిపాళెం,జనవరి9: నేడు (శుక్రవారం) ముక్కోటి సందర్భంగా బుచ్చి నగర పంచాయతీతోపాటు మండలంలోని వైష్ణవాలయాలను ముస్తాబు చేశారు. బుచ్చి పెద్దూరులోని కోదండరామాలయం, జొన్నవాడలోని వరదరాజస్వామి ఆలయంలో వైకుంఠ ద్వారదర్శనం అనంతరం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. పట్టణంలోని బాబా మందిరం. శ్రీకృష్ణమందిరాలు, వేణుగోపాలస్వామి ఆలయం, కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాలతోపాటు శ్రీరంగరాజపురం, పంచేడు, పెనుబల్లి గ్రామాల్లోని వైష్ణవాలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి.


విద్యుత్ దీపాల కాంతులతో కోవూరు కోదండరామాలయం, బుచ్చి కోదండరామాలయంలోనూ, మనుబోలు చెన్నకేశవాలయంలోనూ ముక్కోటి ఏర్పాట్లు

● మనుబోలు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మనుబోలుతోపాటు పలు గ్రామాల్లో ఉన్న వైష్ణవాలయాలను ముక్కోటిని పురస్కరించుకుని గురువారం ముస్తాబు చేశారు. ఆలయాలకు రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాల వెలుగులో శోభయామానంగా అలంకరించారు. అలాగే స్వామివారి గ్రామోత్సవానికి అన్నీ ఏర్పాట్లు చేశారు.

● కోవూరు, (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్థానిక కోదండరామాలయం, వీరాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం ఉత్తరద్వార దర్శనం ఏర్పాట్లను పూర్తి చేసినట్లు అర్చకులు శ్రీకాంతాచార్యులు, జనార్దనం నాగరాజాచార్యులు తెలిపారు. కోదండరామాలయంలో ఉభయదాతగా ఆళ్ల కృష్ణారెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరిస్తారన్నారు. ఈ సందర్భంగా ఆలయాల్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు.

గ్రామీణ రోడ్లకు మరమ్మతు చేయాలి

కోవూరు, జనవరి9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గ్రామీణ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. సంక్రాంతి సందర్భంగా ఆలయాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శుల్ని కోరారు. రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, విద్యుతు శాఖ ఏఈలు రమేష్, మునిరాజా, గిరిధర్ మాట్లాడారు.

కోడి వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోండి


సీఐ సుబ్బారావుకి వినతిపత్రం అందజేస్తున్న జనసేన నేతలు

వెంకటాచలం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో కోడి వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని జనసేన సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బీ. సురేష్‌నాయుడు కోరారు. గురువారం సీఐ సుబ్బారావును ఆపార్టీ నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పక్క రాష్ట్రాల నుంచి కోడి మాంసం వ్యర్థాలను తీసుకువచ్చి చేపల చెరువుల్లో వేస్తున్నారని, వాటిపై దృష్టి సారించాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో గుమ్మినేని వాణీభవాని నాయుడు, సందూరి శ్రీహరి, చల్లా చెంచయ్య, రామిరెడ్డి, మణి, అఖిల్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో భక్తుల మృతి కలిచివేసింది...

నెల్లూరు (హరనాథపురం), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ కేంద్రంలో బుధవారం జరిగిన తొక్కి సలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందడం కలిచివేసిందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూ రు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు పేర్కొన్నారు. ఆ దు ర్ఘటనపై వారు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మరణించిన భక్తుల కుటుంబ సభ్యులను అధికారులు ఆదుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృ తం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కాగా, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తిరుపతికి వెళ్లి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు.


బాధితులను పరామర్శిస్తున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

20 నుంచి ఇంటింటా 'కుష్ఠు' సర్వే

నెల్లూరు రూరల్, జనవరి 9,(ఆంధ్రజ్యోతి) : కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించి తగు నివారణ చర్యలు తీసుకునేందుకు ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వరకు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ కంట్రోల్ అధికారి, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. గురువారం నెల్లూరు రూరల్ మండలం సౌత్ మోపూరు పీహెచ్‌సీని ఆయన ఆకస్మి కంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. 'కుష్ఠు' సర్వేను సమ ర్థంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతీ నెల 9వ తేదీన పీఎంఎస్ఎంఏ కార్యక్రమాన్ని విధిగా నిర్వహించి గర్భవతులకు ఆరోగ్య సలహాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వైద్యులతో మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలి

భోగి మంటల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వద్దు

నెల్లూరు (వైద్యం), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : భోగి మంటల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయరాదని ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ ప్రేమ్‌దీప్ వెల్లడించారు. బ్లాక్‌బోర్డు మిత్ర మండలి, పీఎంపీ అసోసియేషన్ సంయుక్తంగా నగరంలోని వైవీఎం పాఠశాల ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలపై గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించాయి. భోగిమంటల్లో టైర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడం వల్ల వాతావరణ కలుషితమవుతుందన్నారు. పనికిరాని తాటాకులు, గంపలు, చాటలు, గడ్డితో భోగి మంట వేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఎంపీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, బ్లాక్‌బోర్డు మిత్రమండలి అధ్యక్షుడు నరసాపురం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

నెల్లూరు(విద్య), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రచార సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడిచినా నేటికీ విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఈ విద్యా సంవత్సరం తల్లికి వందనం పథకాన్ని పూర్తిగా తొలగించారని, వసతుల కల్పనలో కూడా వెనుకబడి ఉన్నారన్నారు. విద్యార్థులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓబన్న జయంతి జీవో హర్షణీయం

నెల్లూరు (హరనాథపురం), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులివ్వడం హర్షణీయమని ఆంధ్ర ప్రదేశ్ వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పు భాస్కర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వానికి, ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 11న ఓబన్న జయంతిని జిల్లా వ్యాప్తంగా ఉన్న వడ్డెరలు పండుగలా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

బుచ్చిరెడ్డిపాళెం,జనవరి9(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్‌లో స్వయం ఉపాధి పథకాల కింద సబ్సిడీతో బ్యాంకు రుణాలు ఇవ్వనున్నారని ఎంపీడీవో శ్రీహరి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన బీసీ, ఈబీసీ, కమ్మ,కాపు, రెడ్డి, ఆర్య వైశ్య, బ్రాహ్మణ కులాలకు చెందినవారు ఈ నెల 16లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

దుప్పట్ల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం,జనవరి9(ఆంధ్రజ్యోతి): స్థానిక లయన్స్ క్లబ్ అధ్వర్యంలో ముక్కోటిని పురస్కరించుకుని గురువారం కల్యాణ వేంకటేశ్వరస్వామి, సాయిబాబా, కోదండరామస్వామి ఆలయాల వద్ద పేదలకు దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నిర్వాహకులు టీ సుబ్రహ్మణ్యం, పీ మస్తాన్‌బాబు, వెంకటనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

యోగా సెంటర్ ప్రారంభం

కొడవలూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్తురాజుపాలెంలో గురువారం వివేకానంద యోగా సెంటర్‌ను గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దారు స్ఫూర్తిరెడ్డి, ఎంపీడీవో సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాటూరు రమేష్, నాసిన ప్రసాద్, తువ్వర ప్రవీణ్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

కొడవలూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లి కిషోర్ అన్నారు. మండలంలో యల్లాయపాలెం గురువారం ఆయన అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులకు సన్మానం

పొదలకూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో సంక్రాంతిని పురస్కరించుకుని గురువారం మండల పాత్రికేయులకు సన్మానం చేశారు. సర్వేపల్లి నియోజకవర్గ జనసేన నాయకులు బొబ్బేపల్లి సురేష్‌నాయుడు మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టులది కీలకపాత్ర అన్నారు. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సురేష్‌నాయుడును జనసేన నాయకులు సత్కరించారు.కార్యక్ర మంలో జనసేన మహిళా అధ్యక్షురాలు బొమ్మినేని వాణి భవానీనాయుడు, నారదాసు రవి, తురకా ప్రసాద్, బీ.మనోజ్, కే.ప్రసాద్, వై.మనోజ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సందర్శన

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ పీహెచ్‌సీని గురువారం పీఎంఎస్ఏ(ప్రధానమంత్రి మాతృ సురక్ష అభియాన్) ప్రోగ్రాం అధికారి డాక్టర్ దయాకర్ సందర్శించా రు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. ఏఎన్‌సీ కార్డులు పరిశీలించి గర్భిణులకు సూ చనలిచ్చారు. ఆయన వెంట శ్రీకాంత్, ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అహ్మద్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

నెల్లూరు రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కల్యాణ్‌నగర్‌లో నిర్మించతలపెట్టిన సీసీరోడ్లకు టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. వైసీపీ హయాంలో ప్రజా సమస్యలు పట్టించుకున్ననాథుడు లేడన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అ భివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. అనంతరం ఏసీ కూరగాయల మార్కెట్ వద్దనున్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు.

సహావరస పీఠాధిపతిగా ఆంథోనీదాస్

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు మేత్రాసనం సహావరస పీఠాధిపతి (ఉత్తరాధికారి)గా పిల్లి ఆంథోనీ దాస్ ప్రమాణ స్వీకార (పవిత్రాభిషేక) ఉత్సవం గురువారం జరిగింది. ఈ కార్యక్రమం నగరంలోని సెయింట్ జోసఫ్ ఇంగ్లీషు మీడియం స్కూలు రోమన్ కాథలిక్ చర్చి ఫాదర్లు, సేవకుల సమక్షంలో జరిగింది. మేత్రాసనం పీఠాధిపతి డాక్టరు ఎండీ ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

రంగడి భక్తులకు డ్రైఫ్రూట్స్ లడ్డూలు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం తల్పగిరి రంగనాథస్వామిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు శ్రీరామ హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో చీరాల డ్రైఫ్రూట్స్ లడ్డూలు పంపిణీ చేయనున్నట్లు భక్త బృందం సభ్యుడు పాదర్తి బాలాజీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత ప్రసాదం పంపిణీని పదేళ్లుగా కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.

అన్న క్యాంటీన్లపై రోజూ పర్యవేక్షణ

నెల్లూరు(సిటీ), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అన్న క్యాంటీన్లను ప్రతీరోజూ పర్యవేక్షించాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ నోడల్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని ఇందిరా భవన్ వద్దనున్న అన్న క్యాంటీన్‌ను ఆయన సందర్శించారు. ఆహారం న్యాణ్యతను పరిశీలించారు. నోడల్ అధికారులు ప్రతీ రోజు అన్న క్యాంటీన్లలో ఆహారం నాణ్యత, తాగునీరు, పారిశుధ్యం, వంటశాల వంటివి పరిశీలించాలని స్పష్టం చేశారు. అనంతరం 46వ డివిజన్ మండపాల వీధి, కాపువీధి, గడ్డంవారివీధి, ట్రంకురోడ్డు ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని పరిశీలించారు. కొత్త చెత్త కుండీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న 46వ డివిజన్ 3వ సచివా యం అడ్మిన్, కొందరు కార్యదర్శులకు షోకాజు నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో ఏడీసీ నందన్, ఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య పాల్గొన్నారు.

విద్యాలయాల్లో సంక్రాంతి

● అలరించిన ముందస్తు సంబరాలు
● ప్రత్యేక సెట్టింగులు, చిన్నారుల ఆటపాటలు


ఓవెల్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు


అవెన్యూస్ పాఠశాలలో భోగి మంట



నారాయణ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుక

నెల్లూరు(విద్య), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నగరంలోని పలు విద్యాసంస్థల్లో గురువారం ముందస్తు వేడుకలు నిర్వహించారు. పల్లె వాతావరణం ఉట్టిపడేలా ప్రత్యేకంగా సెట్టింగులు వేశారు. రంగవల్లులు తీర్చిదిద్ది భోగి మంటలు వేశారు. చిన్నారులు ఆటపాటలు, క్రీడా పోటీలతో సందడి చేశారు.

● ఓవెల్ విద్యాసంస్థల్లో రంగవల్లులు, భోగి మంటలతో సంబరాలు చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలో పెద్ద పండుగ విశిష్టతను అందరికీ అర్థమయ్యే రీతిలో తెలియచేశారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీ, బాలురకు గాలిపటాల పోటీ నిర్వహించారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు రంగోలీ, మెహందీ, గాలిపటాల పోటీలు జరిగాయి. వీటిల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు పాఠశాల ప్రతినిధులు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో విద్యా సంస్థ చైర్మన్ ఆర్ వేణు, సీఈవో ప్రమీల, జీఎం మహదేవన్, రఫీ, మీనాక్షి, సిబ్బంది పాల్గొన్నారు.

● బాలాజీనగర్‌లోని నలంద పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు జరిగాయి. విద్యార్థులకు గాలిపటాలను అందచేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చైర్మన్ ఎండీ ముజహర్, డైరెక్టర్ ఫహీం, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, హెచ్ఎం హేమలత పాల్గొన్నారు.

● కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో బాలికలకు రంగవల్లుల పోటీ నిర్వహించారు. విజేతలకు వీఎస్‌యూ రిజిస్ట్రార్ కే సునీత, స్థానిక కార్పొరేటర్ చేజర్ల మహేష్ బహుమతులు అందచేశారు. హెచ్ఎం భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● సరస్వతినగర్ డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాలలో సంబరాలు జరిగాయి. పల్లెటూరి జీవన విధానం, వ్యవసాయం, పనిముట్లు, రచ్చబండ, పొంగళ్లు, కోడిపందేలు తదితర కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులకు భోగి పండ్లు పోసి పండుగ విశిష్టతను తెలియజేశారు. బాలబాలికలకు రంగవల్లులు, గాలిపటాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. విద్యా సంస్థల డైరెక్టర్లు డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతి, జీఎం రామ్మూర్తినాయుడు, మేనేజర్ అజయ్‌సింగ్, ఏవో తుహీనా, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

● నగరంలోని అవెన్యూస్ పాఠశాలలో విద్యార్థులు జానపద నృత్యాలు, సంక్రాంతి గీతాలు, హరికథ ప్రదర్శన చేశారు. భోగిమంటలు వేసి పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం ముగ్గులు, సంప్రదాయ క్రీడా పోటీలు నిర్వహించి గెలిచిన వారికి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ కళా కృష్ణస్వామి, చైర్మన్ బాబునాయుడు, కరస్పాండెంట్ కృష్ణచైతన్య, హెచ్ఎం శ్వేత సంధ్య, వైస్ ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

● నగరంలోని రామలింగాపురం నారాయణ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించి సంస్కృతీ, సంప్రదాయాలు ఉట్టిపడేలా పలు కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులు నిర్వహించిన జానపద నృత్యాలు, పాటలు, కోడిపందేలు, బసవన్నల ఆటలు, పల్లెపడుచుల కోలాహలం అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు నరేంద్రరెడ్డి, వెంగళరావు, సోని, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తొక్కిసలాట ఘటనపై

న్యాయ విచారణ

- మృతుల కుటుంబాలకు రూ.25లక్షల పరిహారం
- రెండు గంటల్లోనే పోస్టుమార్టం పూర్తిచేసి స్వస్థలాలకు మృతదేహాల తరలింపు
- డీఎస్పీ రమణకుమార్, టీటీడీ గోశాల డైరెక్టర్ హరినాథరెడ్డి సస్పెన్షన్
- ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ జేఈవో గౌతమి, సీవీఎస్వో శ్రీధర్ బదిలీ

తిరుపతి కన్నీరు పెట్టిన వేళ...

అఖిలాండకోటి భక్తజనం కన్నీరు పెట్టింది. తిరుపతి నగరం దుఃఖ సముద్రంగా మారిపోయింది. వైకుంఠద్వార దర్శనాల కోసం ఎక్కడెక్కడి నుంచో వచ్చి అశువులుబాసిన వారిని చూసి గుండె పగిలేలా ఏడ్చింది. బుధవారం రాత్రి బైరాగిపట్టెడ పార్క్ ప్రధాన గేటు వద్ద జరిగిన తొక్కిసలాటలో మరణించిన ఆరుగురి మృతదేహాలున్న.. రుయా మార్చురీ ప్రాంతం ఏడుపులతో నిండిపోయింది. గాయపడిన వారున్న స్విమ్స్ పద్మావతి ఆసుపత్రి.. నాయకుల పరామర్శలతో కిక్కిరిసింది. ఏర్పాట్లలో వైఫల్యమా? భక్తోత్సాహపు ఆత్రుతా? నిర్వహణ లోపమా?.. కారణాలు ఏవైనా కన్నుమూసింది మాత్రం అమాయకపు, సాధారణ భక్తజనం. లక్షల పరిహారాలు.. పోయిన ప్రాణాలను వెనక్కి తీసుకురావు. విపక్షపు నిందలు.. ఓదార్పునివ్వవు. వైకుంఠద్వారాల్లోంచి స్వామి దర్శనం కోసం వచ్చి విగతజీవులైన తమవారి దేహాలతో కుటుంబసభ్యులు స్వస్థలాలకు పయనమయ్యారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి




చంద్రబాబు ఓదార్పు


పవన్ కల్యాణ్ పరామర్శ


జగన్ పలకరింపు


మంత్రుల భరోసా

మనసు కలత చెందింది

తిరుపతి సంఘటన నా మనసును కలిచివేసింది. బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నాం. రాజకీయాలకతీతంగా వెంకన్నకు సేవ చేస్తున్నామన్న భావనతో అందరం ముందుకెళ్లాలి. అధికారయంత్రాంగం సమన్వయంతో ఇలాంటి అపశ్రుతులు జరగకుండా జాగ్రత్త పడాలి. ఇటువంటి సంఘటనలు ఇక జరగకుండా చర్యలు తీసుకుంటాం.

- సీఎం చంద్రబాబు

క్షమించండి !

ఈ ఘటనకు శ్రీవారి భక్తుల్ని, రాష్ట్ర ప్రజల్ని, హైందవ ధర్మాన్నీ.. ఇలా ప్రతి ఒక్కరినీ క్షమించమని ప్రభుత్వం తరుపున కోరుతున్నా. తప్పు జరిగిందని తప్పించుకోవడంలేదు. బాధ్యత తీసుకుంటున్నాం. తొక్కిసలాట జరిగితే సహాయక చర్యలు ఎలా ఉండాలనే ప్రణాళిక కూడా లేదు. అధికారులు చేసిన తప్పులకు మేము తిట్లు తింటున్నాం. టీటీడీలో ప్రక్షాళన మొదలుకావాల్సిన అవసరం ఉంది.

- డిప్యూటీ సీఎం పవన్

ప్రతిష్ట దిగజార్చారు

టీటీడీ పరువు ప్రతిష్ఠను దిగజార్చింది చంద్రబాబు ప్రభుత్వమే. టీటీడీ ఛైర్మన్, ఉన్నతాధికారులతో పాటు బాబు కూడా బాధ్యుడే. కుప్పం పర్యటనకు పోలీసులను తరలించి, ఇక్కడ ప్రత్యామ్నాయం చూడకపోవడం కూడా తప్పిదమే. సీఎం పర్యటనకు ఇచ్చిన ప్రాధాన్యత భక్తులకు ఇవ్వలేదు. ఇది ఓ బ్లాక్ మార్క్‌లా నిలిచిపోతుంది.

- మాజీ సీఎం జగన్

తిరుపతి, జనవరి9(ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతిలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో ఆరుగురి మృతి నేపథ్యంలో గురువారం తిరుపతి నగరం ఉక్కిరి బిక్కిరి అయ్యింది. సీఎం, డిప్యూటీ సీఎం, విపక్ష నాయకుడు, మంత్రుల రాకతో ఘటన జరిగిన బైరాగిపట్టెడ ప్రాంతం, క్షతగాత్రులున్న స్విమ్స్ పద్మావతి ఆసుపత్రుల ప్రాంగణం ఓదార్పులతో హోరెత్తిపోయింది. ఉదయం ఎనిమిదింటికే మంత్రుల బృందం రుయా ఆస్పత్రికి చేరుకుంది. హోం మంత్రి అనిత, రెవెన్యూ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ రుయా మార్చురీవద్ద విలపిస్తున్న మృతుల బంధువులను ఓదార్చారు. దగ్గర ఉండి మృతదేహాలను వారి స్వస్థలాలకు అధికారులను వెంట ఇచ్చి పంపించారు.

చంద్రబాబు ఆగ్రహం

మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు బైరాగపట్టెడలోని పద్మావతి పార్కుకు చేరుకుని ఘటనా స్థలానికి పరిశీలించారు. అక్కడే ఉన్న అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది క్షమించరాని తప్పుగా అభివర్ణించారు. అక్కడనుంచి నేరుగా మధ్యాహ్నం 2.40 గంటలకు స్విమ్స్ ఆస్పత్రికి వెళ్లి గాయపడిన వారిని పరామర్శించారు. దాదాపు గంటకు పైగా వారితో పాటు బంధు మిత్రులతో మాట్లాడారు. సంఘటన ఎలా జరిగిందో అడిగి తెలుసుకున్నారు. దురదృష్టకర ఘటనపై చింతించారు. ఆతర్వాత టీటీడీ పరిపాలన భవనంకు చేరుకుని తొక్కిసలాట ఘటనపై అధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియా సమావేశంలో ఎస్పీ సుబ్బారాయుడు, జేఈవో గౌతమి, సీవీఎస్వో శ్రీధర్‌లను బదిలీ చేస్తున్నట్టు ప్రకటించారు. గోశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డి, డీఎస్పీ రమణకుమార్‌లపై సస్పెన్షన్ వేటు వేశారు. మీడియా సమావేశం అనంతరం సాయంత్రం 6.30గంటల ప్రాంతంలో తిరిగి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని విజయవాడకు పయనమయ్యారు.

మండిపడ్డ పవన్

సీఎం చంద్రబాబు టీటీడీ ఏడీ బిల్డింగ్‌లో ఉండగానే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మధ్యాహ్నం 3.30గంటలకు తిరుపతి చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి నేరుగా తొక్కిసలాట చోటు చేసుకున్న బైరాగిపట్టెడ ప్రాంతంలోని పద్మావతి పార్క్ రామానాయుడు పబ్లిక్ స్కూల్ పరిసరాలను పరిశీలించారు. అక్కడ తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీటీడీ బోర్డు సభ్యులు ఆనంద సాయితో పాటు అధికార యంత్రాంగంతో చర్చించారు. ప్రమాదానికి గల కారణాల గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి సాయంత్రం 4.20గంటలకు స్విమ్స్‌కు చేరుకొని చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి గాయాలైన వారి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. చికిత్స పొందుతున్నవారినీ, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆస్పత్రి బయటకువచ్చి మీడియాతో మాట్లాడారు. టీటీడీ, పోలీస్ అధికారుల వైఫల్యాలపై మండిపడ్డారు. తొక్కిసలాటకు బాధ్యత వహిస్తూ క్షమించమని వేడుకున్నారు.

జగన్ హడావుడి

పవన్ మీడియాతో మాట్లాడుతుండగా వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో తన అనుచరగణంతో ఆస్పత్రికి చేరుకున్నారు. ఈసందర్భంగా వైసీపీ శ్రేణులు నానా యాగీచేయడంతో విమర్శలకు గురయ్యారు. తొక్కిసలాట ఘటనకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండు చేశారు.

కుట్రకోణంపై పవన్ అనుమానాలు

వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీలో జరిగిన తొక్కిసలాటపై కుట్రకోణాలు దాగివుందని వస్తున్న అనుమానాలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా లేవనెత్తారు. ముఖ్యంగా పోలీసుల వైఫల్యాలను ఆయన ఎండగట్టారు. అంతేకాకుండా స్విమ్స్ ఆస్పత్రిలో క్షతగాత్రులను పవన్ పరామర్శించి బయట మీడియాతో మాట్లాడుతుండగా అప్పుడే జగన్మోహన్ రెడ్డితో పాటు వైసీపీ ముఖ్యనేతలను పోలీసులు ఆసుపత్రి లోపలకు అనుమతించడంపై పవన్ తప్పుబట్టారు. ఉద్విగ్న పరిస్థితుల నేపథ్యంలో ఒక నాయకుడు పర్యటనకు వచ్చినప్పుడు అదేస్థానానికి మరో నాయకుడిని ఎలా అనుమతిస్తారని పవన్ ప్రశ్నించారు. ఇదేదో ఉద్దేశ్యపూర్వంగా చేస్తున్నట్టు కనిపించందని తిరుగు ప్రయాణంలో విమానాశ్రయం వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వద్ద ఈ అంశంపై మాట్లాడారు.




ఘటన జరిగిన టోకెన్ల జారీ కేంద్రంలో చేసిన ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఎం

తిరుమలలో వైకుంఠ శోభ



వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా తిరుమల వెంకటేశ్వర ఆలయం ఉత్తరద్వార దర్శనానికి సిద్ధమైంది. ఇందుకోసం సర్వాంగ సుందరంగా ఆలయాన్ని అలంకరించారు. గురువారం అర్ధరాత్రి దాటాక వైకుంఠనాథుడి దర్శనానికి ఆలయ ద్వారాలు తెరిచారు. శుక్రవారం తెల్లవారుజామున ధనుర్మాస కైంకర్యాలు నిర్వహించాక భక్తులను దర్శనానికి అనుమతించనున్నారు.

- వివరాలు 4లో -



తిరుమలలో వైకుంఠ శోభ

● నేటి నుంచి పదిరోజుల ఉత్తరద్వార దర్శనాలు ● సుందరంగా ముస్తాబైన శ్రీనివాసుని ఆలయం

తిరుమల, జనవరి9(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల క్షేత్రం ఉత్తరద్వార దర్శనాలకు సిద్ధమైంది. పదిరోజుల పాటు జరిగే వేడుకకు శోభాయమానంగా ముస్తాబైంది. శుక్రవారం నుంచి ఈనెల 19 వరకు వైకుంఠ ద్వారాన్ని తెరిచి దర్శనం కల్పించనున్నారు. ఈక్రమంలో ఆలయాన్ని శోభాయమానం తీర్చిదిద్దారు. ఐదు టన్నుల సంప్రదాయ పుష్పాలతో అలంకరించారు. వైకుంఠద్వారం, బలిపీఠం, ధ్వజ స్తంభం వంటి ప్రాంతాలను 1.40 కట్‌ఫ్లవర్స్‌తో అలంకరించారు. ఆలయం వెలుపల ఐదు టన్నుల పుష్పాలను అలంకరణకు వినియోగించారు. వాహన మండపం సమీపంలో 'శ్రీరంగనాథమండపం' సిద్ధం చేశారు. వివిధ రకాల పండ్లు, కూరగాయలు, పుష్పాలతో రంగనాథస్వామి ఆలయ సెట్టింగ్ వేశారు.

తెరుచుకున్న వైకుంఠ ద్వారాలు

గురువారం అర్ధరాత్రి శ్రీవారి ఆలయంలోని వైకుంఠద్వారాలు తెరుచుకున్నాయి. 12.05 గంటల సమయంలో తలుపులు తెరిచిన అర్చకులు శుక్రవారం వేకువజాము ధనుర్మాస కైంకర్యాలు నిర్వహించారు. 4.30 వీఐపీ దర్శనాలను కల్పించనున్నారు. టోకెట్లు, టికెట్లు పొందిన భక్తులను గురువారం అర్ధరాత్రి12 గంటల నుంచి క్యూకాంప్లెక్స్‌లోకి అనుమతించారు. వీఐపీ బ్రేక్ దర్శనాలు ఉదయం 8 గంటలకు ముగియనున్నాయి. తర్వాత సర్వదర్శనాలను ప్రారంభించనున్నారు.

టోకెన్ ఉన్నవారికే ఎంట్రీ, వసతి

టికెట్లు, టోకెన్లు ఉన్న భక్తులను గురువారం రాత్రి నుంచి కంపార్టుమెంట్లలోకి అనుమతించారు. వారికే గదులను కేటాయించారు. టికెట్లు లేనివారు గదులు లేక షెడ్లు, పార్కులు, కార్యాలయాల ముందు, వసతి సముదాయాల్లో, ఫుట్‌పాత్‌ల పైనే సేదతీరాల్సి వచ్చింది. చలికి వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడ్డారు.

ప్రత్యేకదర్శనాలన్నీ రద్దు

ఈపదిరోజులకు సంబంధించి ఇప్పటికే రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు 1.40 లక్షలు, శ్రీవాణి టికెట్లు 19,500 జారీ చేశారు. తొలిమూడురోజులకు సామాన్య భక్తులకు స్లాటెడ్ సర్వదర్శనానికి సంబంధించి 1.20 లక్షల టోకెన్లను జారీ చేసింది. తర్వాత రోజులకు ఏరోజుకారోజు విష్ణునివాసం, శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్స్‌ల ద్వారా జారీ చేయనున్నారు. పదిరోజుల్లో వీఐపీ బ్రేక్‌కు సిఫార్సులు, వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డల తల్లిదండ్రులు వంటి ప్రత్యేకదర్శనాలు ఉండవు. శ్రీవారిమెట్టు మార్గంలోనూ దివ్యదర్శన టోకెన్ జారీ ఉండదు.

వీఐపీలకు చేసిన ఏర్పాట్లు

వీఐపీల పర్యటన నేపథ్యంలో తిరుమలలో 12 వేల వాహనాలకు పార్కింగ్ ప్రదేశాలు సిద్ధం చేశారు. ఎంబీసీ, ఔటర్‌రింగ్‌రోడ్డు, రాంభగీచా, పరకామణి భవనం, అర్చక నిలయం ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. వీఐపీలకు దర్శన టికెట్లు, గదుల కేటాయింపు నాలుగు కేంద్రాల్లో జరిగాయి. వెంకటకళ అతిథిగృహంలోని కౌంటర్‌లో గవర్నర్లు, ముఖ్యమంత్రులు, న్యాయమూర్తులు, మంత్రులు, విప్‌లు, స్పీకర్లకు టికెట్లను జారీ చేశారు. సన్నిధానం కౌంటర్‌లో టీటీడీ బోర్డు చైర్మన్, బోర్డు సభ్యులు, వారి సిఫార్సులపై టికెట్లు కేటాయించారు. నారాయణగిరి-4 కౌంటర్‌లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు టికెట్లను జారీ చేశారు. వకుళమాత విశ్రాంతి భవనం కౌంటర్ ద్వారా ఆలిండియా సర్వీస్ అధికారులకు దర్శన టికెట్లు, గదుల కేటాయింపు జరిగింది.



నేడు స్వర్ణరథోత్సవం

శుక్రవారంఉదయం 9 నుంచి 10 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామి స్వర్ణరథంపై కొలువుదీరి మాడవీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు వాహనమండపంలో శ్రీమలయప్పస్వామి దర్శనం ఉంటుందన్నారు. శనివారం ద్వాదశిని పురస్కరించుకుని తెల్లవారుజాము 5.30 గంటలకు సుదర్శన చక్రత్తాళ్వార్ల చక్రస్నాన కార్యక్రమం జరుగుతుంది.

ఘటనపై రెండు కేసులు





మార్చురీలో మృతదేహాలు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆరుగురు భక్తుల మృతిపై డీఎస్పీ వెంకటనారాయణ ఆదేశాలతో సీఐ రామకృష్ణ రెండు వేర్వేరు ఎఫ్ఆర్ఐలు నమోదు చేశారు. బుధవారం రాత్రి తిరుపతిలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఘటనల్లో తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లాకు చెందిన మెట్టూరువాసి ఆర్.మల్లిక.. విష్ణు నివాసం వద్ద దర్శన టోకెన్ల కోసం క్యూలో నిలబడి అక్కడ జరిగిన తొక్కిసలాటలో స్పృహతప్పి పడిపోయిందని బాలాయపల్లి తహసీల్దార్ పి.శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. ఇది మొదటి కేసుగా పోలీసులు తెలిపారు. మల్లికను రుయాకు తీసుకెళుతుండగా, ఆస్పత్రికి వెళ్లేలోగా మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన మేరకు ఆ సమయంలో ఇతర భక్తులు క్యూలైన్ వైపు పరుగెత్తడంతో ఆమె అనారోగ్యం కారణంగా నేలపై పడిందని తెలిపారు. వీరితోపాటు బైరాగిపట్టెడ పార్కు వద్ద మృతి చెందిన ఐదుగురికి సంబంధించి నారాయణవనం తహసీల్దార్ ఎం.జయరాములు ఇచ్చిన ఫిర్యాదుతో మరో కేసు నమోదు చేశారు. విశాఖకు చెందిన కందిపల్లి శాంతి, గుడ్ల రజని, బొడ్డేటి నాయుడు బాబు, సూరిశెట్టి లావణ్య స్వాతి, తమిళనాడుకు చెందిన నిర్మల మృతి చెందినట్లు ఫిర్యాదులో తెలిపారు. రామానాయుడు పార్కు వద్ద దర్శనం టికెట్ల కోసం వేచి ఉండగా క్యూలో ఒక్కసారిగా తోపులాట జరిగి కిందపడ్డారని తహసీల్దార్ ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరిని రుయాకు తరలించగా.. ఈ ఐదుగురు కూడా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ రెండు కేసులపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలకు బాధ్యులెవరు? ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? అనే కోణంలో విచారణ చేస్తున్నారు. బంధువులు, కుటుంబీకుల నుంచి రాతపూర్వకంగా స్టేట్‌మెంట్లు నమోదు చేశారు.

ప్రత్యక్ష సాక్షుల కథనాలు

గోవిందా..గోవిందా అంటూ...

నేను టోకెన్ల కోసం వచ్చి 8.10-8.25గంటలమధ్య ముందువరుసలోనే ఉన్నాను. గోవిందా.. గోవిందా అంటూ నా వెనుకనుంచి బలవంతంగా తోయడంతో కిందపడిపోయాను. దీంతో ఊపిరి ఆడలేదు. ఎలాగో పైకి లేచి నిల్చుని ఊపిరి పీల్చుకున్నాను. తొక్కిసలాట జరిగింది. గేటుకు దూరంగా జరగాలని పోలీసులు మైకుసెట్‌లో పలుమార్లు అనౌన్స్ చేశారు. అక్కడున్న వారిలో చాలామంది తెలుగువాళ్లు కాదు. తమిళం, కన్నడ మాట్లాడుతున్నారు. వాళ్లకు అర్థం కాలేదు. కొంతమంది కదిరి, పులివెందుల ప్రాంతాల నుంచి వచ్చినట్లు వాళ్ల యాసను బట్టి అర్థం అయ్యింది. ఒక ఉప్పెనలా ముందుకు రావడంతో అంతా గందరగోళం అయిపోయింది. రెండుగేట్లు ఓపెన్ అయిపోయాయి. పోలీసులు ఎంతప్రయత్నించినా నిలువరించలేకపోయారు. భక్తులు కిందపడిపోయారని పోలీసులు చెబుతున్నా వినకుండా ఫోర్స్‌గా తోసుకుంటూ వచ్చారు.

- సుదర్శన్‌రెడ్డి, కడప

పోలీసులు అరుస్తున్నా..



తిరుపతి రూరల్ మండలం అవిలాల మాది. మధ్యాహ్నం 12.30గంటల సమయంలో అటువైపు వెళ్లాను. పార్కులో చిన్నపిల్లలు, వృద్ధులు, భక్తులు ఎక్కువసంఖ్యలో కనిపించారు. తిరిగిరాత్రి 8.20గంటలప్రాంతంలో ఈమార్గంలో వెళ్తూ అటు చూశాను. వేలాదిమంది టోకెన్లకోసం పార్కులో గుమికూడా ఉన్నారు. ఒకరినొకరు తోసుకుంటూ ఉన్నారు. గేటుకు దూరంగా జరగాలని పోలీసులు మైకుసెట్‌లో చెబుతున్నారు. ఈలోపే తొక్కిసలాట జరిగింది.

- లక్ష్మణ్, అవిలాల

అంతా గేటు ముందే!



మధ్యాహ్నం నుంచి భక్తులరాక బాగా పెరిగింది. వచ్చినవారందరూ గేటుముందు భాగంలోకి వచ్చి తోసుకుంటూ ఉన్నారు. వెనుక భాగమంతా ఖాళీగానే ఉంది. పోలీసులు వెనుకకు జరగండని అనౌన్స్‌మెంట్ చేశారు. తీరా గేట్లు తెరచీతెరవముందే భక్తులు దూసుకువచ్చారు. దీంతో తోపులాట జరిగింది. ఘోరం జరిగిపోయింది.

- రాకేష్, స్థానిక దుకాణం వ్యక్తి

స్పెషల్ ఫ్లైట్లతో కిటకిటలాడిన ఎయిర్‌పోర్ట్

రేణిగుంట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన పెను విషాదం, వైకుంఠ ఏకాదశి పర్వదినం వెరసి వీఐపీల తాకిడితో విమానాశ్రయం గురువారం కిటకిటలాడింది. బాధితులను పరామర్శించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ సీఎం జగన్ వేర్వేరుగా తిరుపతి పర్యటనకు వచ్చారు. సీఎం మధ్యాహ్నం 1.20గంటలకు వచ్చి రాత్రి ఎనిమిది గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మధ్యాహ్నం 3.30గంటలకు వచ్చి రాత్రి 8.25గంటలకు బయల్దేరారు. మాజీ సీఎం జగన్ సాయంత్రం 5.30 గంటలకు ఇక్కడకు చేరుకున్నారు. వీరంతా ప్రత్యేక విమానంలో వచ్చారు. మరోవైపు తిరుమలేశుడి వైకుంఠ ద్వార దర్శనం కోసం కేంద్ర విమానయన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కూడా విశాఖపట్నం నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 1.30గంటలకు వచ్చారు. తర్వాత తిరుచానూరులో జరిగే ప్రైవేటు కార్యక్రమాలకు వెళ్లారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు ఇండిగో విమానంలో కుటుంబీకులతో కలిసి మధ్యాహ్నం 1.10గంటలకు వచ్చారు. తర్వాత తిరుమలకు బయల్దేరి వెళ్లారు. హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ.. ఇండిగో విమానంలో ఉదయం 10.50గంటలకు వచ్చారు. తిరుపతి, రాజంపేటలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొని, 11వ తేదీన శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం కానున్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి.. ఇండిగో విమానంలో సాయంత్రం 4 గంటలకు వచ్చారు. తర్వాత రోడ్డు మార్గాన తిరుమలకు బయల్దేరారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి తెల్లవారుజామున 4.55 గంటలకు విమానాశ్రయం చేరుకుని, తిరుమలకు వెళ్లారు. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తిరుమలేశుడి దర్శనార్థం విశాఖపట్నం నుంచి వచ్చారు. ఇలా వచ్చిన వీఐపీలతోపాటు వారికి స్వాగతం పలకడానికి వచ్చిన వారితో తిరుపతి విమానాశ్రయం కిక్కిసింది. ఇక శుక్రవారంనుంచి వైకుంఠ ద్వార దర్శనం కోసం వివిధ రాష్ట్రాల నుంచి పలువురు ప్రముఖులు రానున్నారు.



టీటీడీ పరిపాలనా భవనంలో మంత్రులు, అధికారులతో సీఎం మీడియా సమావేశం

టీటీడీ చరిత్రలో చీకటి రోజు

ఇటువంటి ఘటన జరగడం చాలా బాధాకరం. టీటీడీ చరిత్రలో ఇది ఒక చీకటి రోజుగా నిలిచిపోతుంది. అధికారుల వైఫల్యమే దీనికి ప్రధాన కారణం. మృతుల కుటుంబీకులకు టీటీడీ, ప్రభుత్వం అండగా నిలుస్తుంది. గాయపడిన ప్రతీ ఒక్కరు కూడా స్వామివారిపై ఉన్న భక్తితో తమకు దర్శన భాగ్యం కల్పించండి అని కోరుతున్నారు. వారి కోరిక మేరకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించి, సురక్షితంగా స్వగ్రామాలకు పంపే ఏర్పాటు చేస్తాం.

- టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

ఇలాంటి ఘటన దురదృష్టకరం

ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరం. అంచనాలకు మించి భక్తులు అధిక సంఖ్యలో రావడం, వారిని అదుపు చేయలేకపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగింది. ఇందులో ఎవరి నిర్లక్ష్యం ఏమాత్రం ఉందనేది విచారణలో తేలుతుంది. బాధ్యతా రహితంగా వ్యవహరించిన వారికి శిక్ష తప్పదు. అలాగే బాధితులకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా నిలుస్తుంది.

- టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి

టీటీడీ వైఫల్యం ఏమీ లేదు

శ్రీవారి భక్తులకు ఈ విధంగా జరగడం చాలా బాధాకరం. వైకుంఠ దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం టీటీడీ అన్ని ఏర్పాట్లు పక్కాగా చేసింది. అయినప్పటికీ ఊహించని రీతిలో భక్తులు రావడం, వారు దూర ప్రాంతాల నుంచి ప్రయాణం చేసి ఉండటం వల్ల నక్రమంగా ఆహారం లేక నీరసించి కిందపడి పోవడంతో తొక్కిసలాట జరిగింది. ఇందులో టీటీడీ వైఫల్యం ఏమీ లేదు.

- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

సాధారణ భక్తులకు ప్రాధాన్యం లేకనే..

టీటీడీలో వీఐపీలకు తప్ప సాధారణ భక్తులకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వడం లేదు. అందువల్లే సాధారణ భక్తుల విషయంలో టీటీడీ, పోలీసుల సమన్వయం లేక ఇటువంటి దురదృష్టకర ఘటన జరిగింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. మృతుల కుటుంబాలను, బాధితులను టీటీడీ, ప్రభుత్వం ఆదుకోవాలి.

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

శవ రాజకీయాలు చేస్తే సహించేది లేదు

వైసీపీ నేతలు వారు చేసిన తప్పులను మరిచి జరిగిన దురదృష్టకర ఘటనను అడ్డం పెట్టుకొని శవ రాజకీయాలు చేసేందుకు తెర లేపుతున్నారు. ప్రధానంగా టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి.. టీటీడీని, ప్రభుత్వాన్ని నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు. బాధితులను పరామర్శించి.. అండగా ఉండాలే కానీ, తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదు.

- తిరుపతి జనసేన ఇన్‌చార్జి కిరణ్‌రాయల్

టీటీడీ, ప్రభుత్వ వైఫల్యమే!

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఘటనకు టీటీడీ, ప్రభుత్వ వైఫల్యమే కారణమని వైసీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ నెలరోజులుగా వైకుంఠ ఏకాదశి పేరుతో సమీక్షలు నిర్వహించారే తప్పా ఆచరణలో తగిన ఏర్పాట్లు చేయలేదని విమర్శించారు. టీటీడీలో పనిచేసే వారు తక్కువయ్యారని పర్యవేక్షించేవారు ఎక్కువ అయ్యారని అన్నారు. దర్శనాలకు సంబంధించిన అంశం పూర్తిగా తిరుమల అడిషనల్ ఈవో వెంకన్న చైదరికి సంబంధించిందని ఆయనకు చంద్రబాబు సేవ తప్ప భక్తుల సేవ కనబడటంలేదని విమర్శించారు. ఈ ఘటనలో అడిషన్ ఈవో వెంకన్నచౌదరితో పాటు ఎస్పీ, సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని, ఈవోను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తానని చెప్పిన పవనానంద స్వామి దీనిపై మాట్లాడాలంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష, చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మోహిత్‌రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భూమన కరుణాకర్‌రెడ్డి, పక్కన మేయర్ శిరీష, మోహిత్‌రెడ్డి

వీవీఐపీల రాకతో ఒత్తిడికి గురైన యంత్రాంగం



అధికారులతో చంద్రబాబు

తిరుపతిలో బుధవారం తొక్కిసలాట ఘటన నేపథ్యంలో ఇప్పటికే తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న జిల్లా యంత్రాంగంపై గురువారం వీవీఐపీల వరుస పర్యటనలు మరింత ఒత్తిడి పెంచాయి. దాంతో అధికారులు సతమతమయ్యారు. బుధవారం తిరుపతిలోని బైరాగిపట్టెడ టోకెన్ల జారీ కేంద్రం వద్ద జరిగిన దుర్ఘటనను తీవ్రంగా పరిగణించిన సీఎం చంద్రబాబు బుధవారం రాత్రే అధికారులపై మండిపడ్డారు. తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడం దేశవ్యాప్తంగా కలకలం రేపడం, సీఎం చంద్రబాబు సీరియస్ కావడంతో జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు ఆందోళనకు గురయ్యారు. పర్యవసానాలు ఎలా వుంటాయోనని వారిలో గుబులు మొదలైంది. అదే సమయంలో గురువారం తిరుపతి వస్తానని సీఎం ప్రకటించడంతో అధికారులను టెన్షన్ చుట్టుముట్టింది. సీఎం ఏమి చూస్తారో, ఏమి అడుగుతారో, ఏం చేస్తారోనని భయాందోళనలకు గురయ్యారు. శుక్రవారం వేకువజామున తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వారాలు తెరవనున్న సంగతి తెలిసిందే. వైకుంఠ ఏకాదశి నాడు శ్రీవారిని దర్శించుకునేందుకు దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వీవీఐపీలు వస్తుండడంతో వారికి రవాణా, బస, దర్శనాలు ఏర్పాటు చేయడంలో అటు జిల్లా యంత్రాంగం, ఇటు టీటీడీ యంత్రాంగం కూడా తలమునకలవుతున్నాయి. ఆ సమయంలో తొక్కిసలాట ఘటన జరగడం, సీఎం గురువారం పర్యటన తలపెట్టడం అధికారులకు ఊపిరి సలపకుండా చేశాయి. గురువారం ఉదయాన్నే ఏకంగా ఆరుగురు మంత్రులు తిరుపతిలో దిగారు. జిల్లా ఇంచార్జి మంత్రి హోదాలో రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోంమంత్రి వంగలపూడి అనిత, వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామా నాయుడు, హసింగ్ మంత్రి కొలుసు పార్థసారథి, దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలు బృందంగా ఏర్పడి రుయా, స్విమ్స్ ఆస్పత్రులు సందర్శించారు. వారికి కాన్వాయ్‌లు, పోలీసు ఎస్కార్ట్, వెంట అధికారులను నియమించాల్సి వచ్చింది. బస ఇతర ఏర్పాట్లు కూడా చేయాల్సి వచ్చింది. మధ్యాహ్నానికి సీఎం చంద్రబాబు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడ నుంచీ తిరుపతి వచ్చారు. సీఎం కోసం కాన్వాయ్, భారీ భద్రత కల్పించారు. వెంట జిల్లా అధికారులు మొత్తం వుండాల్సి వచ్చింది. బైరాగిపట్టెడ టోకెన్ల జారీ కేంద్రం వద్ద బహిరంగంగానే ఆయన కలెక్టర్, టీటీడీ ఈవో, ఎస్పీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిణామం అధికారులను తీవ్ర ఒత్తిడికి లోను చేసింది. సీఎం స్విమ్స్ పద్మావతి ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించడం, టీటీడీ పరిపాలన భవనం చేరుకుని అధికారులతో సమీక్షించడం చేశారు. సమీక్షలోనూ అధికారుల తీరుపై మండిపడినట్టు సమాచారం. దానికి తగ్గట్టే ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ వేటు, మరో ముగ్గురిపై బదిలీ వేటు పడింది. ఈ పరిణామం అధికారులను మరింత ఇరుకున పడేసింది. సీఎం పర్యటన సాగుతుండగానే సమాంతరంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తిరుపతి చేరుకున్నారు. ఆయనకు కాన్వాయ్, భారీ భద్రత, వెంట అధికార యంత్రాంగం వుండాల్సి వచ్చింది. ఆయన కూడా బైరాగిపట్టెడ వెళ్ళి అక్కడ నుంచీ స్విమ్స్ వచ్చారు. ప్రజాకర్షణ కలిగిన నేత కావడంతో భారీగా భద్రత కల్పించాల్సి వచ్చింది. ఈ ఇద్దరూ తిరుపతిలో పర్యటిస్తుండగానే ఇంకోవైపు మాజీ సీఎం జగన్ కూడా తిరుపతి వచ్చారు. ఇలా వీవీఐపీలు ఏకకాలంలో తిరుపతి చేరుకుని పర్యటించడంతో అధికార యంత్రాంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



ఆసుపత్రి వద్ద జగన్



బైరాగిపట్టెడ పార్కులో పవన్

శవ రాజకీయాలు మానుకో భూమనా !

● ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ద్వార దర్శన టికెట్స్ కోసం జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. తొక్కిసలాటలో గాయపడి పద్మావతి మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతున్న భక్తులను ఆయన గురువారం పరామర్శించారు. మీడియాతో మాట్లాడుతూ భక్తుల మనోభావాలను కించపరిచేలా మాజీ ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి శవ రాజకీయాలు చేయాలని చూస్తున్నారన్నారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా ప్రజలు ఇవ్వలేదన్న సంగతి ఆయన గుర్తు పెట్టుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను విమర్శించే స్థాయి కరుణాకరరెడ్డికి లేదని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలను, గాయపడిన వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నేతలు సుగుణమ్మ, నరసింహ యాదవ్, జనసేన నాయకులు కిరణ్ రాయల్, రాజారెడ్డి, బీజేపీ నేతలు భానుప్రకాష్ రెడ్డి, సామంచి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, నరసింహ యాదవ్

మృతుల కుటుంబాలకు బీసీవై పార్టీ ఆర్థిక సహాయం

పుంగనూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జరిగిన ఘటనలో మృతి చెందిన ఒక్కో కుటుంబానికి రూ.50వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు బీసీవైపార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ తెలిపారు. గురువారం ఆయన తిరుపతి చేరుకుని మృతుల కుటుంబీకులను పరామర్శించారు. ఈ ఘటనకు టీటీడీ చైర్మన్, ఈవో, అధికారులు బాధ్యులన్నారు. వెంటనే బోర్డును రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైసీపీ విధానాలనే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కొనసాగించడం వల్ల ఇలాంటి ఇబ్బందులు వస్తున్నట్లు ఆరోపించారు.



బాధితురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న రామచంద్ర యాదవ్

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు బాధాకరం



టవర్‌క్లాక్ కేంద్రం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గూడూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా అనుచితవ్యాఖ్యలు చేయడం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురవ బాబు అన్నారు. గురువారం స్థానిక టవర్ క్లాక్ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. అలాగే తిరుపతి తొక్కిసలాటలో మృతిచెందిన భక్తులకు రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జీ పరిమల వెంకటేశ్వర్లు, శ్రీనివాసగౌడ్, సతీష్‌బాబు, గౌస్‌మొహిద్దీన్, రాజయ్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకుందాం



గాలిపటాలు ఎగురవేస్తున్న శ్రావణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

గూడూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని తిరుపతి పార్లమెంటు తెలుగుమహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. గురువారం మండలంలోని చెన్నూరు జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. విద్యార్థులతో కలిసి గాలిపటాలు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, రాజనాల, చిరంజీవి, సందాని, శ్రీనివాసరావు, శంకరయ్య, శ్రీవాణి, లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పన్నులు చెల్లించాలి

గూడూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తే దేశం అభివృద్ధి చెందుతుందని ఆదాయపన్నుల శాఖ అదనపు కమిషనర్ వంశీధర్ అన్నారు. గురువారం స్థానిక ఆస్పత్రి రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఆదాయపన్నుల శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది తప్పుడు క్లైయిమ్‌లు సమర్పిస్తున్నారని అలాంటివారికి భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్ శ్రీకంటి రామమోహన్‌రావు, మోహన్‌కృష్ణ, నాగరాజు, చంద్రమౌళి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గూడూరు అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో గురువారం జేవీవీ ఆధ్వర్యంలో బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా మాట్లాడుతూ ప్రతినెల క్రమం తప్పకుండా జేవీవీ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ పట్టణాధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, డాక్టర్ రాజ, నాగరాజు, పురుషోత్తమరావు, ప్రభాకర్, ఇబ్రహీం, సుమన్ తదితరులు పాల్గొన్నారు.


సంస్కృతి.. సంప్రదాయాలకు పండుగలు చిహ్నాలు



మాట్లాడుతున్న విజయభాస్కర్ రెడ్డి, పక్కన రియాజ్, మల్లికార్జున

నాయుడుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సంస్కృతి, సంప్రదాయాలకు ఆయా పండుగలు చిహ్నాలుగా అద్దంపడుతాయని టీడీపీ సీనియర్ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. నాయుడుపేట నారాయణ పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలలో ఆయన పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల తరహాలో సెట్టింగ్, హరిదాసులు, రైతులు, సంప్రదాయ వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి చంద్రారెడ్డి, ఉగ్గుమూడి భాస్కరెడ్డి, క్లస్టర్ ప్రిన్సిపాల్ నూర్ రియాజ్, ప్రిన్సిపాల్ మల్లికార్జున, ఏవో గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన వారికి అభినందనలు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ కిషాన్‌ధర్

కోట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న అనిల్‌కుమార్, అంకిత, రాజేశ్వరి, నవంత్, భార్గవ్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. స్థానిక కళాశాలలో ఇటీవల బెంగళూరుకు చెందిన రూమెన్ టెక్నాలజీస్ సంస్థ ప్రాంగణ ఎంపికలను నిర్వహించి వారిని ఎంపిక చేసుకుంది. వార్షిక వేతనం రూ.7లక్షల వరకు ఉంటుంది. ఈ క్రమంలో గురువారం డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ప్రాంగణ ఎంపిక అధికారి డాక్టర్ కిషాన్‌ధర్‌లు వారిని అభినందించారు.

వారం రోజుల్లో చేపల చెరువు వేలం వేయండి

పెళ్లకూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిల్లకూరు చెరువులో చేపల పెంపకానికి వారం రోజుల్లోపు వేలం వేయాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో పంచాయతీ తీర్మానం చేసి వేలం పాట నిర్వహిస్తామని ఈవోపీఆర్డీ విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

నాయుడుపేట టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట రైల్వే స్టేషన్ సమీపంలో ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాపూరుకు చెందిన షాదీక్ గత డిసెంబరు 26వ తేదీ నాయుడుపేట రైల్వే స్టేషన్ సమీపంలో తన ద్విచక్ర వాహనం పార్కింగ్ చేసి చెన్నై వెళ్లాడు. తిరిగి సాయంత్రం వచ్చి చూసేసరికి వాహనం కనిపించలేదు. పరిసర ప్రాంతాలలో గాలించినప్పటికి ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సముద్రంలో ఇద్దరు విద్యార్థుల గల్లంతు

- భారీ అలలకు కొట్టుకెళ్లిన వైనం
- తూపిలిపాళెంలో దుర్ఘటన



భానుప్రకాష్



లోకేష్

వాకాడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సముద్ర స్నానానికి వెళ్లిన ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిట్టమూరు మండలం మల్లాంలోని సీవీఎస్ఆర్ ఇంటర్మీడియట్ కళాశాలలో చదువుతున్న ఎనిమిది మంది విద్యార్థులు కాలేజీకని చెప్పి ఇంట్లో నుంచి బయల్దేరారు. ఆ తర్వాత వాకాడు మండలంలోని తూపిలిపాళెం సముద్రతీరానికి చేరుకున్నారు. గురువారం ఉదయం 11.45గంటలకు సముద్రంలో దిగి స్నానం చేస్తున్నారు. ఆ సమయంలో వచ్చిన భారీ అలలకు నెల్లూరుజిల్లా కావలి ప్రాంతం బంగారుపాళెం గ్రామానికి చెందిన మామిడి లోకేష్ (17), చిట్టమూరు మండలం కొక్కుపాళెం గ్రామానికి చెందిన ఇంగిలాల భానుప్రకాష్ (18)లు సముద్రంలోకి కొట్టుకుపోయారు. భయపడిన మిగిలిన ఆరుగురు ఒడ్డుకు చేరుకుని కేకలు పెట్టారు. అక్కడున్న మత్స్యకారులు గమనించి.. రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే విద్యార్థులు ఇద్దరూ గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు, మెరైన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్లతో గాలింపు మొదలుపెట్టినా ఆచూకీ లభించలేదు. చీకటిపడటంతో గాలింపు చర్యలు ఆపేశారు. శుక్రవారం ఉదయం నుంచి తిరిగి మొదలుపెడతామని పోలీసులు తెలిపారు. గల్లంతైన విద్యార్థుల కుటుంబసభ్యులు సముద్రతీరానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. కాగా, లోకేశ్.. వాకాడు మండలం వైట్‌కుప్పంలోని తన మామ ఇంటి వద్ద ఉంటూ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుకుంటున్నాడు. భానుప్రకాష్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నట్లు స్నేహితులు తెలిపారు.

సీఫల్ హెర్బల్‌లో ఉద్యాన విద్యార్థుల పారిశ్రామిక పర్యటన

వెంకటగిరిటౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గూడూరులోని సీఫల్ హెర్బల్ సంస్థను అన్నమయ్య జిల్లా కోడూరులోని అనంతరాజు పేట ఉద్యాన కళాశాలలో బీఎస్సీ నాలుగో సంవత్సర చదువుతున్న విద్యార్థులు గురువారం సందర్శించారు. అక్కడి నిమ్మ ఉత్పత్తుల తయారీని శాస్త్రవేత్త శ్యాం సుందర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. నిమ్మ శుద్ధి, నిమ్మతో తైలం, పీచుతో పౌడర్ తయారీ, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై సీఫల్ హెర్బల్ సంస్థ ఎండీ విద్యాసాగర్ అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త డాక్టర్ కాందర్‌నాయక్, కళాశాల ఏడీఆర్ డాక్టర్ హరి, మల్లిఖార్జున రెడ్డి పాల్గొన్నారు.

ఎక్కువ లాభాలు వచ్చేలా చూసుకోవాలి

వెంకటగిరిటౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రైతులు నిర్ణయాత్మక శక్తిని పెంపొందించుకోవాలని తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు వచ్చేలా చూసుకోవాలని ఏడీఏ నాగర్జునసాగర్, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీదేవి అన్నారు. గురువారం మండల పరిధిలోని వల్లివేడు గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. పురుగు మందులు వాడకం తగ్గించాలన్నారు. ఏవో సుజాత, ఏఈవో రామమోహన్, చెంచు భాస్కర్, రేఖ, శివకుమార్ పాల్గొన్నారు.

వేధింపుల టీచర్‌పై చర్యలు తీసుకోవాలి

గూడూరు అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలం ఆరూరు జడ్పీఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు అదే పాఠశాలలోని ఉపాధ్యాయురాలితో అభ్యంతరకరంగా వ్యవహరిస్తున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌యూఐ నాయకుడు రాజా కోరారు. గురువారం స్థానిక డిప్యూటీ ఈవో కార్యాలయంలో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎస్‌యూఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రోన్‌లతో ఖర్చు తక్కువ

వెంకటగిరిటౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంలో డ్రోన్‌లు వినియోగిస్తే ఖర్చు, సమయం ఆదా అవుతుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసులురెడ్డి అన్నారు. గురువారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో డ్రోన్‌లపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రోన్ టెక్నాలజీతో ఎరువుల, పురుగు, తెగుళ్ల మందులు పిచికారి చేయ వచ్చున్నారు. 8 నిమిషాల్లో ఎకరా పొలంలో పిచికారి చేయవచ్చు నన్నారు. ఏడీఏ నాగర్జునసాగర్, విజయశ్రీ, తిరుపాల్, రాజీవన రైతులు పాల్గొన్నారు.

గూడలిలో ముందస్తు వైకుంఠ ఏకాదశి

కోట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గూడలిలోని భూదేవి, శ్రీదేవి సమేత జనార్ధన స్వామి ఆలయంలో గురువారం రాత్రి ముందస్తు వైకుంఠ ఏకాదశి వేడుకలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు ఉదయగిరి ఆది శేషాచార్యుల ఆధ్వర్యంలో జనార్ధన స్వామి విగ్రహానికి పలు అభిషేకాలు చేశారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

పెళ్లకూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలతో అనేక ప్రయోజనాలు పొందవచ్చని పునబాక సాగునీటి సంఘం అధ్యక్షుడు వేలూరు హరినాయుడు అన్నారు. గురువారం మండలంలోని పునబాకకండ్రిగ దళితకాలనీలో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. టీడీపీ నాయకులు యుగంధర్‌గౌడ్ ఉన్నారు.

చిల్లకూరు పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

చిల్లకూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి భోగి మంటలు వేశారు. గాలిపటాలు ఎగురవేశారు. విద్యార్థుల తల్లులకు, విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విశ్రాంత హెచ్‌ఎం కోదండ రామయ్య, హెచ్‌ఎం జాన్‌పీటర్, ఉపాధ్యాయులు చంద్రయ్య, శంకరయ్య, సులోచన, శ్రీనివాసులు, మల్లి కార్జున్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.



వైసీపీ పాలనలో గోతులమయంగా ఉన్న చెన్నూరు రోడ్డు ● కూటమి ప్రభుత్వం వచ్చాక గతేడాది డిసెంబరులో అభివృద్ధి పరిచిన అదే రోడ్డు, ప్రస్తుతం మళ్లీ కంకర తేలిపోయి ఉన్న అదే చెన్నూరు రోడ్డు

వీళ్లు మారరు అంతే..!

- మూన్నాళ్ల ముచ్చటగా చెన్నూరు రోడ్డు
- విస్తుపోతున్న ప్రయాణికులు

గూడూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు సంక్రాతి పండుగ లోపు రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఏపీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. ప్రధాన రహదారులలో గోతులను పూడ్చేందుకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారు. ఈ క్రమంలోనే గూడూరు నుంచి రాజంపేటకు వెళ్లే ప్రధాన రహదారిలో దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేపట్టారు. గతేడాది నవంబరు 2వ తేదీన గూడూరు- రాజంపేట మార్గంలోని చెన్నూరు నుంచి తిప్పవరపాడు వరకు దాదాపు రెండు కిలో మీటర్ల మేరకు దెబ్బతిన్న ప్రధాన రహదారిని అభివృద్ధి చేశారు. ఈ రెండు కిలోమీటర్లను బాగు చేయడానికి రూ.65లక్షలు మంజూరు చేశారు. డిసెంబరు 20వ తేదీలోగా పనులు పూర్తి చేశారు. వైసీపీ పాలన మొత్తం గుంతలతో అవస్థలు పడ్డ వాహనదారులు, ప్రయాణికులు కూటమి ప్రభుత్వ చర్యలతో సాఫీగా ప్రయాణాలు సాగించారు. అయితే ఈ సాఫీ ప్రయాణం ఎంతోకాలం సాగలేదు. 21 రోజులు కూడా పూర్తికాలేదు. అప్పుడే రాళ్లు తేలి గుంతల మయంగా మారి పోయింది. రోడ్డు వేసే సమయంలో నాణ్యతా ప్రమాణాలను పాటించక పోవడం, పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ రోడ్డు మూన్నాళ్ల ముచ్చటగా మిగిలింది. సంక్రాంతి పండుగ లోపు రోడ్ల అభివృద్ధి మాట ఏమో గానీ, అభివృద్ధి పరచిన రోడ్డు సంక్రాంతి లోపే దెబ్బతిని తిరిగి అక్కడక్కడా రాళ్లు తేలి పోవడంతో 'పాలకులెవరైనా మారరు' అంతే అని జనం విస్తుపోతున్నారు.

నడిరోడ్డుపై నిలిచిన భారీ వాహనం

నాయుడుపేటలో వాహనచోదకుల అవస్థలు



నాయుడుపేట టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట -మేనకూరు సెజ్‌లోని ఓ కర్మాగారానికి చెన్నై నుంచి బారీ ట్యాంక్‌ను తీసుకువచ్చే లారీ గురువారం నాయుడుపేట - పాత వెంకటగిరి రహదారిపై నిలిచిపోయింది. కాలువపై నిర్మించిన ర్యాంప్, రోడ్డు సమాంతరంగా లేకపోవడంతో లారీ అక్కడ నిలిచిపోయింది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనదారులు పట్టణంలో ఇతర మార్గాల్లో రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా పట్టణంలోని రోడ్లు గుంతలు తేలి అధ్వానంగా ఉన్నాయి. పట్టణానికి ఆనుకుని వెళుతున్న హైవే వచ్చాక పట్టణంలోని రోడ్లను అధికారులు పూర్తిగా గాలికి వదిలేశారని ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్లను బాగుచేయాలని కోరుతున్నారు.

ఘనంగా వివేకానందుడి జయంతి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఆదిశేషారెడ్డి

సూళ్లూరుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట షార్ వారి ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ ఆదిశేషారెడ్డి, అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణారావు, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలి



కాంగ్రెస్ పార్టీ నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలగురవం, వెంకటాచలపతి, రాజారెడ్డి తదితరులు

సూళ్లూరుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన చేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.వెంకటాచలపతి ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురవం విచ్చేశారు. తిరుపతి తొక్కిసలాటలో మృతిచెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కుటుంబంలో ఒకరికి టీటీడీలో ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బద్దెపూడి రాజారెడ్డి, జానకిరామ్, పొన్నా మునస్వామి పాల్గొన్నారు.

చదువుతోనే బాల్యవివాహాలకు అడ్డుకట్ట



మాట్లాడుతున్న సీడీపీవో సంషాద్‌బేగం

డక్కిలి, జనవరి 8 : (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఆడబిడ్డా చదువుకోవాలని అప్పుడే బాల్యవివాహాలకు అడ్డుకట్ట పడుతుందని వెంకటగిరి ఐసీడీఎస్ సీడీపీవో సంషాద్ బేగం అన్నారు. గురువారం స్థానిక జడ్పీ హైస్కూల్లో వెలుగు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలకు కిషోరి వికాస్ కార్యక్రమంలో భాగంగా ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలపై అంగన్వాడీ కార్యకర్తలు, వెలుగు, వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది, పొదుపు సంఘాల సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్లు, ఎంపీపీ గోను రాజశేఖర్, వైద్యాధికారి బిందుప్రియ, వెలుగు ఏపీఎం జమున, సూపర్‌వైజర్ పరిమళ పాల్గొన్నారు.

జగన్ తన బలగంతో వెళ్లడం సరికాదు

పెళ్లకూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో మృతిచెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని స్వర్ణముఖి ఆయకట్టు మాజీ చైర్మన్ పేరం రమేష్‌నాయుడు పేర్కొన్నారు. గురువారం పెళ్లకూరులో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షతగాత్రులను పరామర్శించేందుకు 200 మందితో వైసీపీ అధినేత జగన్ వెళ్లడం సరికాదన్నారు.

గుండెపోటుతో సర్పంచ్ మృతి



సర్పంచ్ ప్రసాద్ (ఫైల్‌ఫోటో)

సూళ్లూరుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోపాల్ రెడ్డిపాళెం సర్పంచ్ నెల్లిపూడి పోలా ప్రసాద్ (37) గుండె పోటుతో మృతి చెందాడు. బుధవారం రాత్రి చాతిలో నొప్పిగా ఉండడంతో కుటుంబ సభ్యులు వెంటనే సూళ్లూరుపేటలో ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. సర్పంచ్ ప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నేడు సూళ్లూరుపేట మున్సిపల్ సమావేశం

సూళ్లూరుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం శుక్రవారం గాండ్లవీధిలోని శ్రీశక్తి భవనంలో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతుందని కమిషనర్ చిన్నయ్య గురువారం ఒక ప్రకటనలో తెలి పారు.

ముందస్తు సంక్రాంతి

సూళ్లూరుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిం చారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగి మంటలు వేశారు. హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాములమిట్ట పాఠశాలలో

తడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పాములమిట్ట ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు జరిగాయి. గురువారం పాఠశాలలో విద్యార్థులకు రంగవల్లుల పోటీ జరిగింది. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. హెచ్‌ఎం ఉస్మాన్‌బాషా, ఎస్‌ఎంసీ చైర్మన్ మునిరాజ, గ్రామపెద్ద చిరంజీవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూసర్వేపై అవగాహన ర్యాలీ

తడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో భూసర్వే ప్రాజెక్టుకు ఎంపికైన అక్కంపేట గ్రామంలో అవగాహన ర్యాలీ జరిగింది. గురువారం తహసీల్దారు శరత్ బాబు ఆధ్వర్యంలో సర్వేపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సర్వేకు అందరూ సహకరించాలని కోరారు.

విద్యార్థులపై శ్రద్ధతీసుకోవాలి



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న నారాయణరావు

కోట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సంక్రాంతి సెలవుల్లో విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ గురుకులాల జిల్లాకన్వీనర్ నారాయణరావు కోరారు. కోటలోని బీసీ బాలుర జూనియర్ కళాశాల, గురుకులాలలో గురువారం ఉపాధ్యాయులు, తల్లిదం డ్రులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు వెళ్లనున్న నేపథ్యంలో ఇంటివద్ద ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా తయారుచేయించిన దీపిక వర్షిణి పుస్తకాలను చదివించాలన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

పెళ్లకూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో మృతిచెందిన మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి ప్రభుత్వం అండగా నిలిచి ఆదుకోవాలని ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ చిల్లకూరు సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం చిల్లకూరు వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం..!

- మీ కాంట్రాక్టు బిల్లుల కోసం సమావేశాలా
- అడ్డగోలుగా ఆక్రమణ తొలగింపు అన్యాయం
- కౌన్సిలర్లును ప్రజలు నిలదీస్తున్నారు
- చైర్‌పర్సన్‌పై మండి పడ్డ కౌన్సిలర్లు



మాట్లాడుతున్న కౌన్సిలర్ కళ్యాణి



చైర్‌పర్సన్‌తో వాగ్వాదం చేస్తున్న బాలయ్య

వెంకటగిరిటౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన గురువారం అత్యవసర సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్లు ఏకపక్షంగా చైర్‌పర్సన్‌పై మండిపడ్డారు. బీఫాం తీసుకుంది వైసీపీ నుంచి అయితే టీడీపీకి ఎందుకు మద్దతు ఇస్తున్నారని వారిపై ధ్వజమెత్తారు. సమస్యలు పరిష్కరించలేక ప్రజలకు సమాధానం చెప్పకోలేక వార్డులో తిరగలేని పరిస్థితి ఉందని విచారం వ్యక్తం చేశారు. మున్సి పాలిటీల కాంట్రాక్టు బిల్లుల కోసం సమావేశాలు నిర్వహిస్తున్నారే తప్ప ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా చైర్‌పర్సన్, అధికారులు చొరవ చూపడం లేదని వైస్ చైర్మన్ బాలయ్య ధ్వజమెత్తారు. తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ కాలువలు వంటి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నా పట్టించుకోలేదని వాపోయారు. అనంతరం 9వ వార్డు కౌన్సిలర్ కందాటి కళ్యాణి మాట్లాడుతూ కౌన్సిల్‌కి చెప్పకుండానే టీచర్స్ కాలనీలో ఆక్రమణలు తొలగించడం అన్యాయ మన్నారు. 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య మాట్లాడుతూ మున్సి పాలిటీలో జంతు వధ శాలలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలని విన్నవించారు. మున్సిపాలిటీలో కోతులు, కుక్కలు, పందులు, ఆవుల బెడదను నివారించాలన్నారు. సచివాలయంలో ఎప్పుడూ సర్వర్ పనిచేయడం లేదని తెలియజేశారు. 4వ వార్డు కౌన్సిలర్ ఎంవీ నారాయణ మాట్లాడుతూ 4వ వార్డులో కోట్ల విలువ చేసే భూములు రెవెన్యూ శాఖలో పెద్దాయన రాత్రికి రాత్రే మార్చేసి మాయచేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు. వెంకటగిరిని రెవెన్యూ డివిజన్‌గా చేయాలని కోరారు. 7వ వార్డు కౌన్సిలర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మూడేళ్లగా తమ వార్డులో ఏపనులు చేశారో లెక్క చూపాలని చైర్‌పర్సన్‌ను నిలదీశారు. చైర్‌పర్సన్ నుంచి స్పందన లేకపోవడంతో సమావేశాన్ని ఆయన బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ ఇన్‌ఛార్జి కమీషనర్ శీధర్, అధికారులు పాల్గొన్నారు.